www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -211 బుధవారం18 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

బంగాళాఖాతంలో మరో తుపాన్ కలకలం!

- తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు.. భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల ముప్పు

- ఈ నెలలోనే మూడో తుపాన్ ముప్పు.. 19 నాటికి తీవ్ర తుపాన్‌గా అక్వాన్



గ్రామ ఎన్నికల అభ్యర్థులకు పోలీసు రక్షణ

● నామినేషన్ల సమయంలో ఆటంకాలు లేకుండా చూడాలి.. భద్రత కోరుతూ వచ్చిన వినతులపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశం



ప్రపంచ సవాళ్లపై ఉమ్మడి పోరు!

- అంతర్జాతీయ చట్టాల గౌరవానికి దేశాల పిలుపు..

సముద్ర భద్రత, వాణిజ్యం, ఆర్థిక సహకారంపై సంయుక్త ప్రకటన





పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం

- చేయూత పింఛన్లతో వృద్ధులు, నిరుపేదలకు అండ.. సత్తుపల్లిలో పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

సత్తుపల్లి నవంబర్ 17(ప్రజావినికిడి):) పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పెద్దలకు అండగా, పేదలకు తోడుగా చేయూత పింఛన్లు మంజూరు చేస్తున్నామని, సన్నబియ్యం పథకంతో పేదల ఆకలి తీరుస్తున్నామని తెలిపారు. మంగళవారం సత్తుపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో మిగతా2లో...

సమ్మక్క సాగర్ అనుమతులకు సానుకూల సంకేతం!

- బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి..

త్వరలో ప్రక్రియ పూర్తి చేస్తామని ఛత్తీస్‌గఢ్ సీఎం హామీ



హైదరాబాద్, (ప్రజావినికిడి): ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి మంగళవారం రాయ్‌పూర్‌లో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం, నీటి నిల్వ సామర్థ్యం, తెలంగాణకు కలిగే ప్రయోజనాలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన విష్ణుదేవ్ సాయి ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టం 83 మీటర్లు కాగా, 6.94 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను వినియోగించుకోవడమే ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు. భూసేకరణ, పరిహారం, పునరావాసానికి మిగతా2లో...

తెలంగాణపై సోనియా మౌనం ఎందుకు?

- కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ విమర్శలు..

మూడేండ్ల పాలనలో సాధించింది శూన్యమని వ్యాఖ్య




హైదరాబాద్(ప్రజావినికిడి): సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నప్పుడు, ఆమె రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్'లో తెలంగాణ ప్రస్తావన ఎందుకు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీనే అని చెప్పుకునే కాంగ్రెస్ నేతలు దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాభిక్ష కాదని, ప్రజల పోరాటం, కేసీఆర్ నాయకత్వంలో సాగిన ఉద్యమ ఫలితమని పేర్కొన్నారు.మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేండ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, కార్మికులను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే ప్రభుత్వ సాధనగా అభివర్ణించారు.రాష్ట్రానికి మిగతా2లో...

కోటి కుటుంబాలకు బీమా భరోసా!

- ప్రభుత్వ బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు..

19న సిద్దిపేట సభలో దరఖాస్తు విడుదల





పోలీసు పదోన్నతుల వివాదానికి పరిష్కారం

- అధికారుల మధ్య ఏకాభిప్రాయం..

పదోన్నతుల ప్రక్రియ వేగవంతం

హైదరాబాద్, (ప్రజావినికిడి):పోలీసు అధికారుల పదోన్నతులకు సంబంధించి ఏళ్ల తరబడి కొనసాగుతున్న వివాదాల పరిష్కారానికి కీలక ముందడుగు పడింది. సీనియారిటీ, రిజర్వేషన్ ఆఫ్ రోస్టర్ (ఆర్ఓఆర్), ఖాళీలు, అర్హతలపై ఉన్న అభ్యంతరాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు నిర్ణయించారు.

మిగతా2లో...

రైతుల కష్టాలు పట్టవా?

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. రైతులకు తప్పని ఇక్కట్లు

- కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి నెల రోజులైనా కొనుగోళ్లు లేవు.. వేగవంతం చేయాలని హరీశ్‌రావు డిమాండ్



కల్హేర్, (ప్రజావినికిడి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మిగతా2లో...

ప్రపంచ సవాళ్లపై ఉమ్మడి పోరు!

మనీలా,(ప్రజావినికిడి):
ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిణామాలు, పెరుగుతున్న సవాళ్ల నేపథ్యంలో కలిసి ముందుకు సాగాలని తూర్పు ఆసియా దేశాలు సంకల్పించాయి. మనీలాలో మంగళవారం ముగిసిన తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సు అనంతరం 'స్థిరమైన భవిష్యత్తు, పునరుద్ధరణ కోసం కలిసి ముందుకు' అనే శీర్షికతో సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సముద్ర భద్రత, వాణిజ్య ఆంక్షలు, పెరుగుతున్న ధరలు, సరఫరా వ్యవస్థల బలోపేతం వంటి కీలక అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చాయి.ఆసియాన్ దేశాలతో పాటు భారత్, అమెరికా, చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, రష్యా తదితర దేశాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. 1982లో కుదిరిన ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందాన్ని గౌరవించాలని నేతలు స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సముద్ర వాణిజ్యం, నౌకాయానం, గగనతల ప్రయాణ స్వేచ్ఛను పరిరక్షించాలని పిలుపునిచ్చారు.సముద్ర వనరులు, జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సంరక్షణతో పాటు సముద్ర కాలుష్యం, వ్యర్థాల నివారణకు పరస్పర సహకారం పెంచుకోవాలని పేర్కొన్నారు. సముద్రగర్భంలోని కేబుళ్లు, పైప్‌లైన్లు, కీలక మౌలిక



సదుపాయాలకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. **ధరల నియంత్రణకు వాణిజ్య మార్గాలు** నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సరఫరాలో కొరత ఏర్పడకుండా వాణిజ్య మార్గాలను తెరిచి ఉంచాలని దేశాలు నిర్ణయించాయి. కీలక ఖనిజాలతో సహా సరఫరా వ్యవస్థలు అంతరాయాలను తట్టుకునేలా అభివృద్ధి చేయాలని పేర్కొన్నాయి. వాణిజ్య సమస్యలను చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించాయి. వాయు, భూ, సముద్ర మార్గాల్లో అనుసంధానాన్ని విస్తరించడంతో పాటు ఇంధన రంగంలో సహకారాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చాయి.డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, శాస్త్రసాంకేతిక పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్లో పరస్పర సహకారాన్ని విస్తరించాలని నిర్ణయించాయి. ఆన్‌లైన్ మోసాలు, మనుషుల అక్రమ రవాణా, ఇంటర్నెట్ ద్వారా జరిగే లైంగిక వేధింపులు, దోపిడీ వంటి నేరాలను అరికట్టేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పేర్కొన్నాయి. ముఖ్యంగా పిల్లలు, బలహీన వర్గాల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశాయి.ఇంధన, ఆహార భద్రత, ఆరోగ్య వ్యవస్థల స్థిరత్వం, విపత్తుల సన్నద్ధత, సహాయక చర్యలు, వలస కార్మికుల రక్షణ వంటి అంశాల్లోనూ సహకారాన్ని బలోపేతం చేయాలని నేతలు నిర్ణయించారు. **శాంతియుత ఇండో-పసిఫిక్ లక్ష్యం: మోదీ** శాంతియుతమైన, సుస్థిరమైన, సంపన్నమైన ఇండో-పసిఫిక్ ప్రాంతం భారత్ ఆకాంక్ష అని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సులో ప్రసంగిస్తూ ప్రాంతీయ, అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారంలో చర్చలు, దౌత్యానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంత భద్రత, రక్షణ అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రాంతీయ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సమ్మక్క సాగర్ అనుమతులకు సానుకూల సంకేతం!

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని, మిగిలిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.**నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు స్థిరీకరణ** సమ్మక్క సాగర్ బ్యారేజీ ద్వారా ఎస్సారెస్పీ రెండో దశ కింద నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టును స్థిరీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రామప్పపాకాల లింక్ కెనాల్ ద్వారా మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక రూపొందించింది. బ్యారేజీకి అనుమతులు లభిస్తే ఈ ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు ప్రయోజనం చేకూరనుంది. **ముంపు తగ్గించేందుకు నిర్మాణ ప్రాంతం మార్పు** సమ్మక్క సాగర్ ప్రాజెక్టును తొలుత కాంతనపల్లి వద్ద నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే అక్కడ 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో పాటు 17 ఆదివాసీ గ్రామాలు, భద్రతా మౌలిక సదుపాయాలపై ప్రభావం పడుతుందని గుర్తించారు. దీంతో ముంపును తగ్గించేందుకు నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం పూర్తి స్థాయి నీటిమట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం 100 ఎకరాలకు మించదని అంచనా వేశారు. ఈ అధ్యయన నివేదికను ఐఐటీ ఖరగ్‌పూర్ జులై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ.9.88 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లోనే చెల్లించింది. సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో అనుమతుల ప్రక్రియ ముందుకు సాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

కోటి కుటుంబాలకు బీమా భరోసా!

హైదరాబాద్, (ప్రజావినికిడి):
రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీలతో పాటు లక్షలాది మంది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించనున్నట్టు తెలిపారు.ఇప్పటికే అమలులో ఉన్న వివిధ బీమా పథకాల కింద జీవిత బీమాగా రూ.2 లక్షలు, ప్రమాద బీమాగా రూ.10 లక్షల వరకు అందిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించడంతో పాటు దరఖాస్తులను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న వారిలో ఏ ఒక్కరూ కొత్త పథకం అమలుతో నష్టపోకూడదని అధికారులకు స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, దరఖాస్తులను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.**మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు** అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.
చీరలను తక్షణమే అన్ని జిల్లాలకు తరలించాలని సూచించారు. పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఇందిరమ్మ బీమా, చీరల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.
ఈ సమీక్షలో సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, కార్యదర్శి మానిక్‌రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లను రూ.40 వేల కోట్ల వ్యయంతో మంజూరు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారదర్శకంగా 72 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, ప్రశ్నాపత్రాల లీకేజీలకు తావులేకుండా గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు నియామకాలు చేపట్టామని చెప్పారు. గత పదేళ్లుగా నిలిచిపోయిన ఆసరా పింఛన్లను దీపావళి నాటికి అర్హులైన మహిళలు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కులవృత్తుల వారికి కొత్తగా మంజూరు చేశామని తెలిపారు. ప్రతిపక్షాల ప్రచారాలను నమ్మకుండా అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.**మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం** కోటి మంది డ్వాక్రా మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో గత 33 నెలల్లో రూ.73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని ఇల్లు ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొహమ్మద్ రెహానా కమల్, కమిషనర్ కోండ్ర నరసింహ, ఎంపీడీవో రావెళ్ల చిన్న నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చల్లగుళ్ల నరసింహారావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, భీమిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టవా?

(మొదటి పేజీ తరువాయి)

నారాయణఖేడ్ పర్యటనలో భాగంగా నిజాంపేటలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించి, వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు నెల రోజుల క్రితమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినా ఇప్పటివరకు ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదని అన్నారు.
కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, తాగునీరు కూడా కల్పించకపోవడం బాధాకరమన్నారు.
సాగుకు సరిపడా విద్యుత్, నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుంటే, పండించిన పంటను కూడా సకాలంలో కొనుగోలు చేయడం లేదని విమర్శించారు.ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.
కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, బార్‌దాన్, గోనె సంచులు, రవాణా సదుపాయాలు కల్పించి కొనుగోళ్లను వెంటనే వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో మరో తుపాన్ కలకలం!

న్యూఢిల్లీ,(ప్రజావినికిడి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం బలపడుతుండటంతో మరో తుపాన్ ముప్పు పొంచి ఉంది. గడిచిన నెల రోజుల వ్యవధిలో ఇప్పటికే అర్నాబ్, మురసు తుపాన్లు రాగా, తాజాగా మూడో తుపాన్ రానుండటం ఆందోళన కలిగిస్తోంది. దీనికి 'అక్వాన్'గా నామకరణం చేశారు. సముద్రంలో మేఘాలు వేగంగా కదులుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలుగు రాష్ట్రాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది.ఇన్‌సాట్-3డీఎస్, ఇన్‌సాట్-3డీఆర్ ఉపగ్రహ చిత్రాల్లో ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో భారీగా మేఘాలు ఏర్పడినట్లు గుర్తించారు. అక్వాన్ తుపాన్ నవంబర్ 19 నాటికి మరింత బలపడి తీవ్ర తుపాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.**20న తీరం దాటే అవకాశం**ఈ నెల 20న నెల్లూరుతుని మధ్య తుపాన్ తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని హెచ్చరించారు. తుపాన్ ప్రభావంతో నవంబర్ 18 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు మారనున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఈదురుగాలులతో పాటు ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. **మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు** సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. తీరప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గ్రామ ఎన్నికల అభ్యర్థులకు పోలీసు రక్షణ

అమరావతి (ప్రజావినికిడి):
రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులకు తగిన పోలీసు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్లే సమయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చూడాలని పోలీసులకు స్పష్టం చేసింది. భద్రత కోరుతూ అభ్యర్థులు ఈ-మెయిల్, వాట్సాప్ ద్వారా పంపిన వినతులను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ మండవ కిరణ్మయి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్రంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు భద్రత కోరుతూ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్న తమకు రక్షణ కల్పించాలని పోలీసులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వి. సాయికుమార్, సానేపల్లి రామలక్ష్మణరెడ్డి, కొమ్మారెడ్డి దివాకర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు కోర్టుకు తెలిపారు.ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని పిటిషనర్లు ఆరోపించారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

తెలంగాణపై సోనియా మౌనం ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెబుతున్న ప్రభుత్వం.. ఎన్ని పరిశ్రమలు ప్రారంభమయ్యాయి, ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐటీ ఉద్యోగాలు తగ్గుతున్నాయని, భూముల ధరలు పడిపోతున్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్ నగరంలో నీటి కొరతకు నిదర్శనమని అన్నారు.22ఏ పేరుతో భూములను బ్లాక్ చేయడం, హైడ్రా పేరుతో కూల్చివేతలు చేపట్టడం వల్ల రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతింటోందని కేటీఆర్ ఆరోపించారు. పేదల ఇళ్లపై చర్యలు తీసుకుంటూ పెద్దల అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాంధీ కుటుంబానికి బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ నిర్వహించిన భారత్ సమ్మిట్ వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం కలగలేదని, దానికి ఖర్చు చేసిన నిధులను ప్రజల అవసరాలకు వినియోగించి ఉంటే బాగుండేదని అన్నారు. రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ రైతులకు తగిన సహాయం అందడం లేదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ప్రభుత్వం రాజకీయాలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.

పోలీసు పదోన్నతుల వివాదానికి పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

డీజీపీ సీవీ ఆనంద్ చొరవతో మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో 1991, 1995, 1996 బ్యాచ్‌ల సివిల్ ఎస్సైలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పదోన్నతుల ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, సీనియారిటీ వివాదాలు, రోస్టర్ పాయింట్లు, ఖాళీలపై చర్చించారు. కోర్టు కేసులు, ఇతర వివాదాల కారణంగా అర్హులైన అధికారులు పదోన్నతులు కోల్పోకుండా ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లాలని డీజీపీ సూచించారు.**తొలిదశలో 54 అదనపు ఎస్పీ పోస్టులు** డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు తొలిదశలో 54 పోస్టులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. రెండో దశలో 2027 ఆగస్టు నాటికి మరో 34 పోస్టులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం న్యాయపరమైన వివాదాలు లేని 12 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. ప్యానల్ ఇయర్‌లో మరో 10 పోస్టులు కేటాయించనున్నట్లు వెల్లడించారు.సీనియారిటీ, సర్వీసు కాలం, రోస్టర్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని పదోన్నతి జాబితాలను సిద్ధం చేశారు. సమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రక్రియను వేగవంతం చేస్తానని డీజీపీ తెలిపారు. అర్హులైన అధికారులకు నిబంధనల ప్రకారం న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ ఎం. భగవత్, అదనపు డీజీలు, ఐజీలు, డీఐజీలు, ఇతర సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ వేళ ఉద్యోగులకు సెలవు

- **23 పట్టణ స్థానిక సంస్థల్లో నవంబర్ 26న స్థానిక సెలవు..**

గ్రామ పంచాయతీ ఎన్నికల రోజుల్లోనూ వెసులుబాటు

అమరావతి, (ప్రజావినికిడి): ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఈ నెల 26న స్థానిక సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు నగరపాలక సంస్థలు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ఈ సెలవు వర్తించనుంది.ఆయా ప్రాంతాల్లోని ప్రైవేటు సంస్థలు, కంపెనీలు కూడా తమ ఉద్యోగులకు సెలవు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.మరోవైపు గ్రామ పంచాయతీలకు సాధారణ ఎన్నికల పోలింగ్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో మూడు విడతలుగా జరగనుంది. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పోలింగ్ రోజున నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం1881 ప్రకారం స్థానిక సెలవు ప్రకటించే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం కల్పించింది. సెలవు ప్రకటించడం సాధ్యం కాని చోట్ల ఉద్యోగులు ఓటు వేసేందుకు తగిన సమయం కేటాయించాలని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు స్పష్టం చేసింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

బుధవారం18 నవంబర్ 2026

ఆదివాసి యువకుడిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర

భద్రాచలంలోని లాడ్జిని తక్షణమే సీజ్ చేయాలి

మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



వాజేడు,నవంబర్ 18,(ప్రజావినికిడి):
వాజేడు మండల కేంద్రంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర మాట్లాడుతూ,
భద్రాచలంలో నిన్న రాత్రి ఆదివాసీ యువకుడిపై జరిగిన దాడి, హత్య ఘటన తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భద్రాచలం పూర్తిస్థాయి ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ,గిరిజనేతరులు ఇష్టానుసారంగా లాడ్జీలు ఏర్పాటు చేస్తూ ఆదివాసీ హక్కులు, చట్టాలను ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. లాడ్జీల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని, ఇలాంటి ఘటనలు ఆదివాసీ సమాజంలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు.గది కోసం లాడ్జికి వెళ్లిన ఆదివాసీ యువకుడిని అత్యంత దారుణంగా కొట్టి హత్య చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయమని పేర్కొన్నారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే హత్య కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు,లాడ్జి యాజమాన్యం నుంచి కూడా రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలని కోరారు.భద్రాచలం నడిబొడ్డున ఉన్న సంబంధిత ఉన్నతాధికారులు, ఇద్దరు ఐఏఎస్ అధికారులు ఈ ఘటనపై తక్షణమే స్పందించాలని కోరారు. భద్రాచలంలోని ప్రతి లాడ్జికి చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయో లేదో సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేని లాడ్జీలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఐటీడీఏ పీఓ ప్రత్యేక చొరవ తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.అదేవిధంగా భద్రాచలంలో కొత్తగా పుట్టుకొస్తున్న నిర్మాణాలు, నిర్మాణంలో ఉన్న కట్టడాలపై కూడా అధికారులు విచారణ చేపట్టి, ఆదివాసీ భూములు, హక్కులు, చట్టాలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు.ఆదివాసీ ప్రాంతాల్లో 1/70 చట్టం, పీసా చట్టం వంటి చట్టాలను పటిష్టంగా అమలు చేసినప్పుడే ఆదివాసుల హక్కులకు రక్షణ ఉంటుందని, ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా నివారించవచ్చని పూనేం పేర్కొన్నారు.ఆదివాసుల ప్రాణాలకు, హక్కులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.ఈ ఘటనలో బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ తరఫున డిమాండ్ చేస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పట్టణంలోని 9వవార్డులో భక్తిశ్రద్ధలతో నవ చండీ హోమం

శ్రీ ఆంజనేయ స్వామికి నూతన తొడుగులు పూజా కార్యక్రమాలు నిర్వహణ





షాద్ నగర్,(ప్రజావినికిడి):కార్తీక
మాసం అష్టమి పురస్కరించుకుని షాద్ నగర్ పట్టణంలోని 9వ వార్డు విజయనగర్ కాలనీలో గల శ్రీ వీరాంజనేయ స్వామి,సహస్ర లింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం నవచండి పారాయణ హోమం మన్యుపాసుపతం, చేయించారు.దాతల సహకారంతో వీరాంజనేయ స్వామికి నూతనంగా చేయించిన తొడుగు లు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు జోషి విట్టేపు భాను శర్మ,వెంకటకృష్ణ బృందం భక్తులచే ప్రత్యేక పూజలు హోమం నిర్వహించారు. పూజాది హోమ కార్యక్రమాల,అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కొనసాగించారు.ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు దాత పాండురంగం అర్చకులకు నూతన వస్త్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో భూదాన్,సీలింగ్ గైరాన్,భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

భూముల సేకరణ పేరుతో పేదలకు అన్యాయం చేయొద్దు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు లేఖ

షాద్ నగర్,(ప్రజావినికిడి):
తెలంగాణ రాష్ట్రంలో భూదాన్,సీలింగ్ భూములతో పాటు దేవాలయ భూములను పరిరక్షించాలని తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి టీడీపీ తెలంగాణ రాష్ట్ర పార్టీ తరఫున పొలిట్ బ్యూరో సభ్యులు,
షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు లేఖ.
లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. భారతదేశంలో తెలంగాణ రాష్ట్రం భౌగోళికంగా 11వ అతిపెద్ద రాష్ట్రంగా ఉందని,1906లో జనాభా కోటి 11 లక్షల 41 వేలుగా ఉండగా,1946 నాటికి సుమారు కోటి 70 లక్షలకు పెరిగిందని పేర్కొన్నారు. జనాభా పెరుగుదలతో భూమి కోసం నల్గొండ,వరంగల్ ప్రాంతాల్లో సాయుధ పోరాటం జరిగిందని గుర్తుచేశారు. 1946 నుంచి 1951అక్టోబర్ 21వరకు భూ పోరాటాలు కొనసాగాయని వివరించారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి..

ఆచార్య వినోబా భావే,మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తీసుకొచ్చిన భూ సంస్కరణలు,
కోనేరు రంగారావు కమిషన్,ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సూచించిన ఆదర్శాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.
ప్రస్తుతం ప్రభుత్వాలు గైరాన్,సీలింగ్, భూదాన్ భూములతో పాటు దేవాలయ భూములను అభివృద్ధి,పరిశ్రమల పేరుతో సేకరిస్తున్నాయని,దీనివల్ల పేదలు తమ భూములను కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.భూముల సేకరణలో పేదలకు న్యాయం జరిగేలా చూడాలని, వారికి తగిన పరిహారం అందించాలని కోరారు.భూములు సేకరిస్తున్న ప్రభుత్వాలు భవిష్యత్తు తరాల ప్రయోజనాలను కూడా



దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.
పేద రైతుల నుంచి తక్కువ ధరకు భూములు సేకరించి,వాటి ద్వారా భారీ ప్రయోజనాలు పొందే విధానాలకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు.
ప్రభుత్వాలు ప్రస్తుతం సేకరిస్తున్న భూములు భవిష్యత్తులో ఎవరి చేతుల్లోకి వెళ్తాయి? భూమిని కోల్పోయిన రైతుల భవిష్యత్తు ఏమిటి? అనే అంశాలపై ప్రభుత్వం సమగ్రంగా ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ తెలంగాణ రాష్ట్ర పార్టీ తన లేఖలో కోరింది.

పేదల భూములను లాక్కోవడం అన్యాయం

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు,మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు మాట్లాడుతూ,
ఒకప్పుడు పేదల అభ్యున్నతి కోసం తమ సొంత భూములను సైతం దానం చేసిన మహనీయులు ఉండేవారని,నేటి కాలంలో మాత్రం కొందరు సంపద కోసం పేదల భూములను లాక్కుంటున్నారని టీడీపీ తెలంగాణ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు,
షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు.విద్యారంగం అంతగా అభివృద్ధి చెందని రోజుల్లోనే పరోపకార బుద్ధితో వెదిరె రాంచంద్రారెడ్డి,బి.ఎన్.రెడ్డి,బూర్గుల నారాయణరెడ్డి వంటి మహనీయులు తమ సొంత ఆస్తులను పేదల సంక్షేమం కోసం పంచారని గుర్తుచేశారు. నేటి విద్యావంతులు,సంపన్నులు మాత్రం సమాజానికి తిరిగి ఇవ్వడంలో ముందుకు రావడం లేదని విమర్శించారు.
రాష్ట్రంలో ప్రభుత్వ భూములు, భూగర్భ జలాలు, భూగర్భ వనరులు అడుగంట పోతున్నాయని, ఎలక్ట్రిసిటీ,ఇరిగేషన్, తదితర శాఖల అధికారులు విచ్చలవిడిగా ఎన్ఓసీలు ఇస్తున్నారని పేర్కొన్నారు.స్వామినాథన్ కమిషన్ నివేదికలోని వివరాలను ప్రస్తావిస్తూ.. 2005లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం సమాజంలో 10 శాతం ఉన్న సంపన్నుల చేతిలో 54 శాతం భూములు ఉండగా, మెజారిటీ జనాభా కలిగిన ప్రజల చేతిలో కేవలం 3.8 శాతం సాగుభూములు మాత్రమే ఉన్నాయని తెలిపారు.స్వామినాథన్ కమిషన్ ప్రకారం డబ్బులు ఉన్నవారు గ్రామాల్లో భూములు కొనడం వల్ల ప్రభుత్వాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించడంలో విఫలమవుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు పెట్టుబడి,పంట సాగుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడమే కాకుండా,వ్యవసాయానికి పనికిరాని గుట్టలు,రాళ్లు ఉన్నచోట భూములను కేటాయించడం తగదన్నారు.జనావాసాల మధ్య భూగర్భజలాలు పాడయ్యే విధంగా, బంగారు పంటలు పండే భూములను వ్యవసాయానికి దూరం చేయడం సరికాదని అన్నారు. అందువల్ల పేదలకు కేటాయించిన భూములను పరిరక్షించాలని, అసైన్డ్, గైరాన్,సీలింగ్ భూముల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.ప్రభుత్వం పేదల భూములను కాపాడుతూ,ఆనాడు పేదలకు అందించిన భూములు వారికే దక్కేలా చర్యలు తీసుకోవాలని బక్కని నరసింహులు విజ్ఞప్తి చేశారు.

వెంకటాపురం మేజర్ గ్రామ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి

ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ డిమాండ్

వాజేడు,నవంబర్ 18,(ప్రజావినికిడి):



మేజర్ గ్రామ పంచాయతీకి నియమితంగా కార్యదర్శిని నియించాలని జిఎస్పి జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ డిమాండ్ చేశారు.వెంకటాపురం మండల కేంద్రంలో కొమరం భీం విగ్రహం ఆవరణంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిఎస్పి విద్యార్థి విభాగం నాయకులు పూనెం నితిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ హాజరై మాట్లాడుతూ,ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మేజర్ గ్రామపంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడంతో స్థానిక ప్రజలకు అనేక సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు.వెంకటాపురం గ్రామ పంచాయతీ ఇంచార్జిగా వ్యవహరిస్తున్న కార్యదర్శి ఎల్టిఆర్,1/70 చట్టానికి విరుద్ధంగా వలస గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలకు ఇష్టానుసారంగా పర్మిషన్లు ఇస్తూ,ఏజెన్సీ చట్టాలు నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంకటాపురం మేజర్ గ్రామపంచాయతీ నుండి బదిలీగా పంపించి,మళ్ళీ అదే కార్యదరికి తిరిగి వెంకటాపురం మేజర్ గ్రామపంచాయతీకి ఇన్చార్జిగా విధులు నిర్వహించడం పట్ల స్థానిక ప్రజానికానికి చాలా అనుమానాలకు తావిస్తుంది,దిన్ని జిల్లా అధికారులు ఒక్కసారి పరిశీలన చేయాలని తెలిపారు.దీని వెనుక ఉన్న అంతర్యామి ఏమిటో జిల్లా పంచాయతీ అధికారులు తేల్చిచెప్పాలని డిమాండ్ చేశారు. స్థానికంగా నివసిస్తున్న ఆదివాసులకు ఇంటి పన్నులు మంజూరు చేయకుండా అనేక ఇబ్బందులు పెడుతూ,ఆదివాసి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 1/70కి విరుద్ధంగా మైదాన ప్రాంతాల నుండి అక్రమ వలసలు వస్తున్నప్పటికీ వాళ్లని నిరోధించకుండా వాళ్లకి అండగా నిలబడుతూ వారి అక్రమ భవనాలకు ఇంటి పన్ను మంజూరు చేస్తూ,1/70ఎల్ టిఆర్ చట్టాన్ని పాతర వేస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా అధికారులు వెంటనే ఈ సమస్యల మరల పునరావృతం కాకుండా ఉండాలంటే వెంటనే వెంకటాపురం మేజర్ గ్రామపంచాయతీకి శాశ్వతంగా కార్యదర్శిని నియమించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కుంజా ప్రకాష్,పూనెం పార్థు,చంటి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ యువకుని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

నిందితులపై ఎస్సి,ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలి

లాడ్జి యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి - ప్రైవేట్ లాడ్జి లైసెన్స్ రద్దు చేయాలి

బాధితులని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలి

ఆదివాసీ నవ నిర్మాణ సేన నాయకులు ఎట్టి విద్యాసాగర్



వాజేడు,నవంబర్ 18,(ప్రజావినికిడి): భద్రాచలంలోని ఓ ప్రైవేటు లాడ్జిలో రూమ్ కోసం వెళ్లిన ఆదివాసీ యువకులపై అతి కిరాతకంగా దాడికి పాల్పడి దారుణంగా హత్య చేసిన లాడ్జి యాజమాన్యం పై ఎస్ సీ,ఎస్ టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని
ఏఎన్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్విగ్గి , జోమాటోలో పనిచేస్తున్న ఆదివాసీ యువకులు తెల్లం శరత్, కుర్సం ప్రశాంత్, కీసర కార్తీక్ లు భద్రాచలం రామాలయం సమీపంలోని ఓ ప్రైవేటు లాడ్జిలో రూమ్ కోసం వచ్చిన ఆదివాసీ యువకులైన తెల్లం శరత్, కుర్సం ప్రశాంత్, కీసర కార్తీక్ లపై లాడ్జి యాజమాన్యం వాగ్వాదానికి దిగి యువకులను తీవ్రంగా కొట్టడంతో ఆ ఘటనలో తెల్లం శరత్ (24)అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందడం జరిగింది. ఆదివాసీ యువకులపై దాడి చేసి హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎస్సి,ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా తీసుకోవాలని,అలాగే లాడ్జి లైసెన్స్ పూర్తిగా రద్దు చేసి,కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుని కుటుంబానికి లాడ్జి యాజమాన్యం 50 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.లేకపోతే ఆదివాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎన్ ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్,మండల కార్యదర్శి, కోరం మనోజ్,ఏఎన్ ఎస్ నాయకులు పీర్ల రవిరాజు, రాంబాబు, పాయం ఆంజనేయులు, గొంది శోభన్ బాబు,మడకం ప్రకాశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్య పరిరక్షణతోనే సంపన్న రైతు సాధ్యం :డాక్టర్ అనూష



షాద్ నగర్,(ప్రజావినికిడి): నియోజకవర్గంలోని ఫరూక్ నగర్ మండలంలోని చింతగూడ గ్రామంలో ఖేత్ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యకరమైన నేల,సంపన్న రైతు అనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్ రాజేంద్రనగర్‌కు చెందిన డాక్టర్ అనూష రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సమతుల,సహజ ఎరువుల వినియోగం పెంచాలని సూచించారు.నేల పరీక్షలు చేయించి,పరీక్ష ఫలితాల ఆధారంగానే ఎరువులు వినియోగించాలని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చకుండా నేలలో కలిపి సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని సూచించారు.వరి పంటతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు,ఉద్యాన పంటలను సాగు చేస్తూ పంటల మార్పిడిని ప్రోత్సహించాలని వివరించారు.నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ ‘ప్రతి చుక్కకు మరింత పంట‘ అనే విధానాన్ని రైతులు ఆచరించాలని సూచించారు.సుస్థిర వ్యవసాయ పద్ధతుల ద్వారా భూసారం పెంపొందించుకోవడంతో పాటు రైతులు అధిక దిగుబడులు సాధించే అవకాశాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్,మాజీ సర్పంచ్,వ్యవసాయ విస్తరణ అధికారి రాంబాబు,పంచాయతీ కార్యదర్శి వీరభద్రప్పతో పాటు 56 మంది రైతులు పాల్గొన్నారు.

నల్లగొండ రూపురేఖలు మారుతున్నాయి..!

పర్యాటక అభివృద్ధిలో సరికొత్త అధ్యాయం మొదలు

నల్గొండ నవంబర్ 17(ప్రజావినికిడి):



కన్న కలలు సాకారం.. పర్యాటక కేంద్రాలుగా బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాహెబ్ గుట్టలు..
రై రై మంటూ కొండపైకి వాహనాలు.. ఘాట్ రోడ్లతో గుట్టలకు కొత్త కళ!
బ్రహ్మంగారి గుట్టపై ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తి.. బీటీ రోడ్డు పనులు ప్రారంభం...
లతీఫ్ సాహెబ్ గుట్ట అభివృద్ధికి సైతం ప్రత్యేక ప్రణాళిక...
రెండు గుట్టల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 100 కోట్ల నిధుల మంజూరు...
మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక చొరవతో వేగవంతంగా పనులు.
కనకదుర్గ అమ్మవారి ఆలయంతో పాటు ప్రాచీన రామాలయం,శివాలయాలకు మహర్దశ!ప్రకృతి అందాల నడుమ ఆధ్యాత్మిక యాత్ర.. పర్యాటకులకు సరికొత్త అనుభూతి..నల్లగొండకు కొత్త పర్యాటక శోభ.. నగర రూపురేఖలు మార్చే దిశగా అభివృద్ధి అడుగులు

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా

ఇందిరా జీవిత బీమా యోజనకు ఈ నెల 19 నుంచి దరఖాస్తుల స్వీకరణ... -ఎంపీడీవో సుష్మ

అనంతగిరి: నవంబర్ 17 (ప్రజావినికిడి):



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా జీవిత బీమా యోజన పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అనంతగిరి మండల ఎంపీడీవో సుష్మ తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానున్నట్లు ఆమె వెల్లడించారు.మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఎంపీడీవో మాట్లాడుతూ..ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే ఈ జీవిత బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రూ.5 లక్షల బీమా రక్షణతో ఆపద సమయంలో కుటుంబానికి ఆర్థిక అండ లభిస్తుందని, ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే దరఖాస్తుల ప్రక్రియలో మండల ప్రజలు చురుగ్గా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సుష్మ పిలుపునిచ్చారు.

మణుగూరులో వరుస ప్రకంపనలు.. ఊగిన ఇళ్లు, హడలిపోయిన ప్రజలు

నవంబర్ 17(ప్రజావినికిడి):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పరిసర ప్రాంతాల్లో నేడు (నవంబర్ 17) వరుసగా భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఉదయం సమయంలో స్వల్ప వ్యవధిలోనే రెండుసార్లు భూమి కంపించడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థంకాక ఇళ్ల నుంచి ఒక్కసారిగా రోడ్లపైకి పరుగులు తీశారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లి ఓపెన్ కాస్ట్ గని సమీపంలో ఉదయం 11:28 గంటల సమయంలో మొదటిసారి ప్రకంపనలు వచ్చాయి. ఆ తర్వాత కొద్దిసేపటికే, అంటే 11:40 గంటల ప్రాంతంలో మరోసారి భూమి కంపించింది. మణుగూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలైన రాజుపేట, విఠల్‌రావు నగర్, పీకే–1, బాపనకుంట, కొత్త కొండాపురంలలో ఈ ప్రకంపనల ప్రభావం స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా భూగర్భ గనులకు సమీపంలో ఉండే శివలింగపురంలో వరుసగా మూడుసార్లు భారీ శబ్దాలు వినిపించాయని, ఇళ్ల పైకప్పులు కూడా తీవ్రంగా కంపించాయని స్థానికులు చెబుతున్నారు.సాధారణంగా సింగరేణి కాలరీస్ పరిధిలోని ఓపెన్ కాస్ట్ గనుల్లో బ్లాస్టింగ్ ప్రక్రియ ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జరుగుతుంటుంది. ఆ సమయంలో వచ్చే ప్రకంపనలు, శబ్దాలకు స్థానికులు అలవాటుపడ్డారు. అయితే, మంగళవారం ఉదయం వేళల్లోనే ఈ భారీ శబ్దాలు రావడం, భూమి కంపించడంతో ఇది సింగరేణి బ్లాస్టింగ్ లేక సహజంగా సంభవించిన భూకంపమా అనే దానిపై ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది

కొత్తూరులో అత్యాధునిక ఏరోస్పేస్ టూలింగ్ కేంద్రం ప్రారంభించిన

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


షాద్‌నగర్,(ప్రజావినికిడి):



నియోజకవర్గంలోని కొత్తూరు మండలం తిగాపూర్ గ్రామంలో జేహెచ్ ఏరోస్పేస్ సంస్థ ఏర్పాటు చేసిన టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,షాద్‌నగర్ నియోజకవర్గంలోని తిగాపూర్ గ్రామంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఏరోస్పేస్ టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు కావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు.ఈ కేంద్రం షాద్‌నగర్ పారిశ్రామిక ప్రగతికి మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విమానాలు,ఏరో ఇంజన్ల తయారీ,నిర్వహణకు అవసరమైన అత్యాధునిక టూల్స్,ఫిక్చర్లను ఈ కేంద్రంలో తయారు చేయనున్నారని, ఇప్పటివరకు దిగుమతులపై ఆధారపడిన ఈ రంగంలో దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ సంస్థ కీలక పాత్ర పోషించనుందని తెలిపారు.
హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రెసిషన్ ఇంజినీరింగ్ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు,తెలంగాణ రాష్ట్రంలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి, స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి అదేవిదంగా ఉపాధి అవకాశాల కల్పనకు ఇటువంటి పరిశ్రమలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.
రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని కల్పిస్తూ, పారిశ్రామిక అభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. షాద్‌నగర్ ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు కావడానికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా జేహెచ్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు విశాల్, వెంకటేష్‌తో పాటు సంస్థ బృందానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సంస్థ మరింత అభివృద్ధి సాధించి,షాద్‌నగర్ నియోజకవర్గ పారిశ్రామిక రంగానికి,తెలంగాణ రాష్ట్ర ప్రగతికి విశేషంగా దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తూర్ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి,మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్,మాజీ మండల అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి,అంబటి ప్రభాకర్,సాయిలు,కొర్ర రవి,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిపారసుతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు





షాద్‌నగర్,(ప్రజావినికిడి):

పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఫరూక్ నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన పులి అరుణ, ఈగ సుశాంక్, కొత్తోల్ల ప్రణీత్,అలాగే కటిక సత్యనారాయణ,కిషన్ నగర్ గ్రామానికి చెందిన ఉమామహేశ్వరి, ఎల్లంపల్లి గ్రామానికి చెందిన రాములమ్మ,లింగారెడ్డి గూడ గ్రామానికి చెందిన బక్కని యాదయ్య,ఎలికట్ట గ్రామానికి చెందిన నారం పుల్లారెడ్డి,కందివనం గ్రామానికి చెందిన డి. రామచంద్రయ్య,పులి చెర్ల కుంట తండా గ్రామానికి చెందిన మురళి,దేవునిపల్లి గ్రామానికి చెందిన పారా బాల్ రాజ్,రంగసముద్రం గ్రామానికి చెందిన జవ్వాజి స్వాతి తదితరులకు మంజూరైన 605000/ విలువగల సియంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఆయన సిఫారసుతో ప్రభుత్వానికి నివేదించగా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు షాద్ నగర్ ఎమ్మెల్సి నవీన్ రెడ్డి కార్యాలయంలో లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు,ప్రజలకు ఎమ్మెల్సీ ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.తమకు ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,మాజీ కౌన్సిలర్ నందకిషోర్,
మొగిలి గిద్ద సర్పంచ్ బుగ్గ క్రిష్ణ,కందివనం సర్పంచ్ అమ్మునాయక్,మాజీ ఎంపిటిసి బిశ్వ రామ క్రిష్ణ,మాజీ సర్పంచ్లు ప్రశాంత్ రెడ్డి,తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,ఉపసర్పంచ్లు యాదగిరి,మూడవత్ గణేష్,మాజీ ఉపసర్పంచ్లు మల్లేష్ యాదవ్,నరేష్,
బీఆర్ఎస్ నాయకులు శంకరయ్య గౌడ్,శేరి శ్రీనివాస్ రెడ్డి,చించోడ్ బాల్ రాజ్,కంసాన్ పల్లి బాల్ రాజ్, నేనావత్ నరేష్,శివ,అన్వారీ రాజు,దినేష్ సాగర్,మధు, ప్రశాంత్,శేఖర్, కుమార్,సురేష్,గోపాల్ మల్లేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మీ ఫాంహౌస్‌లలో బీఆర్ఎస్ సమ్మిట్ పెట్టాలా?

భారత్ సమ్మిట్‌పై విమర్శలు చేస్తారా?

రాష్ట్ర ఖజానాను ఇతర రాష్ట్రాలకు..

పంచిన విషయం మర్చిపోయారా?

బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపాటు



సత్తుపల్లి/వేంసూరు, నవంబరు 17 (ప్రజావినికిడి):

పెట్టుబడుల కోసం పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ నిర్వహిస్తే బీఆర్ఎస్ నాయకులు అర్థం లేని విమర్శలు చేస్తున్నారని, ఈ సదస్సులు కాకుండా వాళ్ల ఫాంహౌస్‌లలో బీఆర్ఎస్ సమ్మిట్ పెట్టాలా? అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి, వేంసూరులలో చేయూత పథకం కింద మంజూరైన పింఛన్లకు సంబంధించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఖజానాను ఇతర రాష్ట్రాల్లో పంచిన విషయాన్ని మరిచిపోయారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఆయన తన కేసులను మాఫీ చేసుకునేందుకు బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ఇంటికి వెళ్లిన విషయం బయటకు వచ్చిందని, దానికి కేటీఆర్ ఎందుకు సమాధానం చెప్పలేదని నిలదీశారు.
ఎల్‌నినో కారణంగా ప్రపంచవ్యాప్తంగా కరువు పరిస్థితులు ఉన్నా పంటలు ఎండిపోకూడదనే లక్ష్యంతో యూనిట్ విద్యుత్‌ను రూ.15 చొప్పున కొనుగోలు చేసి వ్యవసాయానికి సరఫరా చేశామని చెప్పారు. రాష్ట్రంలో వానాకాలం పంటను కాపాడిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదేనని అన్నారు. తొమ్మిదిన్నరేళ్లు పాలించిన బీఆర్ఎస్ పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని, పేదవాడికి అవసరాలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను వారి గుమ్మం ముందుకు చేరుస్తోందని తెలిపారు. కొత్త పింఛన్లు అందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అయినా ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక విషం కక్కుతున్నాయని ఆయన మండిపడ్డారు. ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ కేటుగాళ్ల పంజా.. 3 ఘటనల్లో 1.57కోట్లు స్వాహా!



హైదరాబాద్ సిటీ, నవంబరు 17(ప్రజావినికిడి):

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త ఎత్తుగడలతో సామాన్యుల నుంచి కార్పొరేట్ సంస్థల వరకు ఎవరినీ వదలకుండా నిలువుదోపిడీ చేస్తున్నారు. హైదరాబాద్‌లో మూడు వేర్వేరు ఘటనల్లో ఏకంగా రూ.1.57కోట్లకు పైగా కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాషింగ్టన్ వెళ్లేందుకు విమాన టికెట్ బుక్ చేసుకున్న మాదాపూర్‌కు చెందిన నటి గోగినేని అనితా చౌదరిని కేటుగాళ్లు మోసం చేశారు. ఈ నెల 12న 'లో ఫ్లై ట్రావెల్స్' పేరుతో సంప్రదించిన నిందితుడు రాజేశ్.. బిజినెస్ క్లాస్ టికెట్ బుకింగ్ పేరుతో డెబిట్ కార్డు వివరాలు, ఓటీపీ తీసుకుని రూ. 4.14లక్షలు కాజేశాడు. నార్సింగిలోని మిశ్రాన్ సెమీకండక్టర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైనా సంస్థ నుంచి ఎలక్ట్రానిక్ విడిభాగాల పరికరాల కోసం జరిపిన లావాదేవీల్లో రూ.1.50 కోట్లకు పైగా మోసపోయింది.నేరగాళ్లు అసలు కంపెనీ ఈమెయిల్ డొమైన్‌లో ఒక చిన్న అక్షరాన్ని మార్చి నకిలీ ఈమెయిల్ సృష్టించి సంస్థ ప్రతినిధులుగా చలామణి అయ్యారు. కొత్త పర్చేజ్ ఇన్వాయిస్ పంపి, అందులో వేరే బ్యాంకు ఖాతా వివరాలను పొందుపరిచారు. దీనిని గుర్తించని ప్రతినిధులు సదరు ఖాతాకు రూ.1.40 కోట్లు బదిలీ చేశారు. కాగా, వాటర్‌బిల్లు బకాయి ఉందంటూ గాజుల రామారానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ పేరుతో వాట్సాప్ సందేశం పంపి తొలుత అధికారిక వెబ్‌సైట్‌లో రూ.1,565 బిల్లు చెల్లించేలా చేశారు. అనంతరం మరో నంబర్ నుంచి ఫోన్ చేసి రూ.13 బకాయి ఉందని, లింక్ ద్వారా చెల్లించాలని ఏపీకే ఫైల్ పంపి ఇన్‌స్టాల్ చేయించారు. ఆ లింక్‌లో బాధితుడు తన కార్డు వివరాలు నమోదు చేయగానే వరుస ఓటీపీలతో రూ 4.36లక్షలు డ్రా చేశారు.

తెలంగాణలో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యం....

--నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు-జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

రాయికల్ నవంబర్-17(ప్రజావినికిడి):

జగిత్యాలలో 2,83,458 కుటుంబాల నమోదు లక్ష్యం.. 20 మండలాలు, 5 మున్సిపాలిటీల పరిధిలో 481 శిబిర కేంద్రాల ఏర్పాటు

పథకంలో నమోదు చేసుకునే సమయంలో బీమాదారుని ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని తప్పనిసరిగా తీసుకురావాలి

ప్రతి నాలుగు శిబిరాలకు ఒక పర్యవేక్షకుడు.. జిల్లాలో 121 మంది పర్యవేక్షకుల నియామకం

నవంబర్ 17, 18 తేదీల్లో అన్ని గ్రామాలు, పట్టణ వార్డుల్లో డప్పు చాటింపు.. ఇంటింటికీ పథకం వివరాల ప్రచారం

డేటా అందుబాటులో లేదనే కారణంతో ఏ ఒక్కరినీ శిబిరం నుంచి వెనక్కి పంపించరాదు

రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 19 నాడు ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి అర్హులైన కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.





కుటుంబంలోని సంపాదించే సభ్యునికి జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ పథకంలో అర్హులైన ప్రతి కుటుంబాన్ని నమోదు చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పథకం ఉద్దేశం, అర్హతలు, నమోదు విధానం, అవసరమైన పత్రాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.

"పథకం అర్హతలు, బీమా నిబంధనలు"

ఈ పథకం కింద ఒక్కో అర్హులైన కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.కుటుంబంలో సంపల

ఆర్.టీ.సీ బస్సు రాక కోసం రహదారి పరిశుభ్రత పనులు ప్రారంభం



మల్లాపూర్ నవంబర్ 17(ప్రజావినికిడి): మల్లాపూర్ మండల కేంద్రంలోని నల్ల (బొంబాయి) పోచమ్మ ఆలయం నుంచి గుండంపల్లి రహదారిపై గ్రామ సరిహద్దు వరకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్ల తొలగింపు పనులను మంగళవారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మాట్లాడుతూ ఆర్.టీ.సీ బస్సు కోరుట్ల నుండి గుండంపల్లి ద్వారా మల్లాపూర్ నుండి ఖానాపూర్ వరకు ప్రారంభించనున్న నేపథ్యంలో రహదారిని శుభ్రపరిచి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ గడ్డం సోమరెడ్డి,పాలకవర్గ సభ్యులు కొంపెల్లి రాకేష్, ముష్కరి రమేష్,ముత్యాల గంగారాజు,అల్లె చంద్రయ్య, కదుర్క రాజేందర్,మొరపు గంగా రాజు, పొచంపల్లి బుచ్చిరమేష్, ముష్కరి సురేందర్,రాజ్ కుమార్ ,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి (ఏ. వీ. ఆర్)గ్రామస్థులు పాల్గొన్నారు.

రాఘవపేటలో మహిళా సంఘ భవనాల నిర్మాణ స్లాబ్ పనులకు శ్రీకారం..

మల్లాపూర్ నవంబర్ 17(ప్రజావినికిడి):



రాఘవపేట గ్రామంలో మహిళా సంఘాల కోసం నూతనంగా నిర్మిస్తున్న రెండు భవనాల నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్ పనులను సర్పంచ్ తోట శ్రీనివాస్ గారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.మహిళా సంఘాలకు శాశ్వత భవనాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ నిర్మాణాలు మహిళలకు ఎంతో ఉపయోగకరంగా నిలవనున్నాయి. మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, సంఘ కార్యకలాపాలను కొనసాగించుకోవడానికి ఈ భవనాలు ఎంతగానో దోహదపడనున్నాయి.గ్రామంలోని ప్రతి వర్గానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ రాఘవపేట గ్రామ అభివృద్ధికి సర్పంచ్ తోట శ్రీనివాస్ గారు నిరంతరం కృషి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎండీ అమీన్, మాధం సాగర్, ర్యాపని ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో...
-మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి ఆరు రోజుల
డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదుపోలీసులు

రాయికల్ మండలం నవంబర్,1(ప్రజావినికిడి):

జగిత్యాల జిల్లా లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగించే వారిపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వేర్వేరు కేసులకు సంబంధించి ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం ఆరు రోజుల జైలు శిక్ష విధించింది.

వివరాల్లోకి వెళితే, జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో అహ్మద్ వాజిద్ ఖాన్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతనికి నిర్వహించిన బ్రీత్ అనలైజర్ పరీక్షలో 171 ఎన్ర్ర ఆల్కహాల్ రీడింగ్ నమోదైంది.

అదేవిధంగా, రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన నరవేణి శ్రీనివాస్ కూడా మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు.అతనికి నిర్వహించిన బ్రీత్ అనలైజర్ పరీక్షలో 307 ఎన్ర్ర ఆల్కహాల్ రీడింగ్ నమోదైంది.

ఈ రెండు వేర్వేరు కేసుల్లో న్యాయస్థానం ఇరువురికి ఆరు రోజుల చొప్పున జైలు శిక్ష విధించింది.

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని పోలీసులు సూచించారు

పోటాపోటీ నామినేషన్ల మధ్య ముగిసిన నామినేషన్ల ఘట్టం.



ఓబులవారిపల్లి



కొర్లకుంట



కటికంవారిపల్లి



బి కమ్మపల్లి

రైల్వే కోడూరు నవంబర్ 17(ప్రజావినికిడి):

ఓబులవారిపల్లె మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కూటమి, వైసిపి, కాంగ్రెస్, బిజెపి, వామపక్షాల, మరియు గ్రామాలలోని వర్గాలు పోటాపోటీ, ఎత్తుకు పై ఎత్తుల మధ్య గ్రామ సర్పంచి, వార్డు సభ్యుల నామినేషన్ల ఘట్టం నేటితో ముగిసింది, మండలంలో సర్పంచ్ పదవుల కోసం 183 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా వార్డు సభ్యుల పదవుల కోసం 489 మంది సభ్యులు తమ అదృష్టం పరీక్షించుకోవడానికి నామినేషన్లు దాఖలు చేశారు బుధవారం స్క్రూట్ ని ఉంటుందని అభ్యర్థులు హాజరుకావాలని మండల అభివృద్ధి అధికారి ఎన్ వి ఎన్ రాజేంద్ర తెలిపారు, ఓబులవారిపల్లి మండలం బికమ్మ పల్లె పంచాయతీ సర్పంచ్ అభ్యర్థినిగా వేమన రత్నమ్మ బంధువులు బికమ్మ పల్లె కూటమి కార్యకర్తలు ఓటర్లు గ్రామ ప్రజలతో కలిసి ర్యాలీగా వచ్చినామినేషన్ దాఖలు చేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బికమ్మ పల్లె సర్పంచిగా నాపై నమ్మకం ఉంచి నన్ను గెలిపించాలని తద్వారా గ్రామాన్ని అన్ని రంగాలలో మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, మీ సహకారంతో గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దే అవకాశం నాకు కల్పించాలని ఆమె ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేమన సుబ్రమణ్యం నాయుడు చప్పిడి బాబు నాయుడు కోటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లి మండలం కొర్లకుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థినిగా వైఎస్ఆర్సిపి ఓబులవారిపల్లి మండల కన్వీనర్ మాజీ టూరిజం శాఖ డైరెక్టర్ వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి సతీమణి వత్తలూరు సుస్మిత నామినేషన్ దాఖలు చేశారు, ఆమె తన స్వగృహం నుంచి బంధువులు స్థానిక ఓటర్లు ప్రజలు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులతో కలిసి ఇంటి నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు అనంతరం ఆమె గ్రామస్తులతో మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తద్వారా కొర్లకుంట గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి గట్టిగా చేస్తానని మీకు హామీ ఇస్తున్నాను అన్నారు,

. ఓబులవారిపల్లి.....

ఓబులవారిపల్లి స్థానిక గ్రామానికి చెందిన ఓబిలి యంగనగారి ప్రత్యూష సర్పంచ్ అభ్యర్థినిగా కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తులతో కలిసి స్థానిక సత్యం దేవత కు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుండి ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు నన్ను గెలిపిస్తే ఓబులవారిపల్లి ని మౌలిక సదుపాయాల కల్పనలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆమె గ్రామస్తులకు హామీ ఇచ్చారు,.....

కటికంవారిపల్లి కి చెందిన కటికం సునిత ఓబులవారిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థినిగా నామినేషన్ దాఖలు చేశారు, అంతేకాకుండా కటికంవారిపల్లి ఆరవ వార్డు సభ్యురాలిగా కూడా నామినేషన్ వేశానని ఆమె తెలిపారు, గ్రామస్తులు విలువైన మీ ఓటు వేసి గెలిపించాలని తద్వారా గ్రామ అభివృద్ధికి పంచాయతీ పురోగతికి సమగ్ర అభివృద్ధికి పాటుపడతానని నిరంతర కృషి చేస్తానని ఆమె గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

జగిత్యాల -నిర్మల్ నేషనల్ హైవే కుమ్మరి పెల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

మ్యాకెలా మహేష్ మృతి పడిగే గంగారెడ్డి పరిస్థితి విషమం





రాయికల్ మండలం నవంబర్,17((ప్రజావినికిడి): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరి పెల్లి సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇందులో మ్యాకెలా మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు గంగారెడ్డి పరిస్థితి విషమంగా ఉంది!! రాయికల్ నుంచి కుమ్మరిపల్లి వైపు వెళ్తున్న బైకు, కుమ్మరి పల్లి నుంచి రాయికల్ వైపు వస్తున్న బైక్ రోడ్ మధ్యలో ఆగి మరో బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి, ఈ ప్రమాదంలో కుమ్మరి పెళ్ళికి చెందిన పడిగే గంగారెడ్డి,తీవ్రంగా గాయపడ్డారు, గంగారెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం, ప్రమాద ఘటనపై పోలీసులకు సమాచారం అందిన వెంటనే స్పందించిన పోలీసులు హుటాహుటిన రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఇద్దరు కుమ్మరి పెళ్లి గ్రామస్తులు మహేష్ మృతదేహానికి పోస్టుమార్టం కొరకు జగిత్యాల తరలించారు కుమ్మరిపల్లి గ్రామం శోక సముద్రంలో మునిగిపోయింది విషాద ఛాయలు అలుముకున్నాయి

నందలూరు,బ్రాహ్మణపల్లి పంచాయతీ సర్పంచులు పసుపుమయం

ఏకగ్రీవాలతో సత్తా చాటిన చమర్తి జగన్మోహన్ రాజు

రైల్వే కోడూరు నవంబర్ 17(ప్రజావినికిడి):

నందలూరు,బ్రాహ్మణపల్లి, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి, సర్పంచ్ స్థానాన్ని తన ఖాతాలో వేసుకుంది. కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో టీడీపీ బలపరిచిన అభ్యర్థి పారా సుబ్బారాయుడు ఎన్నిక లాంఛనమైంది,దీంతో గ్రామంలో ఒక్కసారిగా పండుగ వాతావరణం నెలకొంది, నందలూరు, బ్రాహ్మణపల్లి పసుపుమయంతో ఏకగ్రీవాలు చేసిన టీడీపీ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు నందలూరు బ్రాహ్మణపల్లి స్థానిక నాయకులు కార్యకర్తలు ఆయనకు ధన్యవాదములు తెలియజేశారు, ఈ రెండు పంచాయతీలు ఏకగ్రీవా నికి సహకరించిన స్థానిక నాయకులకు కార్యకర్తలకు ఓటర్లకు గ్రామస్తులకు ధన్యవాదములు తెలుపుతూ హర్షం వ్యక్తం





చేస్తూ, నూతన సర్పంచులు,సుబ్బారాయు డు, గంట కుమారిలను అయన ప్రత్యేకంగా అభినందించారు. ఇది పార్టీ కార్యకర్తల సమష్టి కృషికి, గ్రామ ప్రజల నమ్మకానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తన ఎన్నికకు అండగా నిలిచిన ఇంచార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజుకి సుబ్బారాయుడు గంట కుమారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయన సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివ ప్రసాద్, పార్లమెంట్ ఉపాధ్యక్షులు అండ్లూరి నాగమని రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఇడిమడకుల కుమార్, కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

మహానందిలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి



మహానంది, నవంబర్ 17, (ప్రజావినికిడి):

కార్తీక మాసం సందర్భంగా మహానంది ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని నంద్యాల జిల్లా ఏఎస్పీ సుస్మిత తెలిపారు. కార్తీక మాసం పురస్కరించుకుని మంగళవారం ఆమె మహానంది క్షేత్రానికి చేరుకుని ఎస్సై శివాంజల్, ఏఈఓ మధు, ఆలయ సిబ్బందితో కలిసి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ఈ నెల 24వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా వేలాది మంది భక్తులు వస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్లతో పాటు ప్రసాదాల కౌంటర్లు, ఉచిత దర్శనం క్యూలైన్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. విధుల్లో ఉన్న పోలీసు, ఆలయ, భద్రతా సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు.






ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

డిజిటల్ మృగాళ్లపై ఉక్కుపాదం మోపాలి!

● మహిళల ఆత్మగౌరవంపై సామాజిక మాధ్యమాల్లో దాడులు.. ఏఐతో అసభ్య చిత్రాల సృష్టి ● కఠిన చట్టాలు, వేగవంతమైన చర్యలతోనే సైబర్ వేధింపులకు అడ్డుకట్ట



సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రపంచం అరచేతిలోకి వచ్చేసింది. సమాచార మార్పిడి నుంచి విద్య, వైద్యం, వ్యాపారం వరకు ప్రతి రంగంలో అంతర్జాలం కీలక పాత్ర పోషిస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) రాకతో సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అయితే ఈ సాంకేతిక అభివృద్ధి కొందరు దుర్మార్గులకు మహిళలను వేధించే ఆయుధంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేయడం, వారి చిత్రాలను మార్ఫింగ్ చేయడం, ఏఐ సాయంతో నకిలీ అశ్లీల దృశ్యాలు సృష్టించి ప్రచారం చేయడం వంటి వికృత చర్యలు పెరుగుతున్నాయి. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న ఈ డిజిటల్ మృగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైంది.**అభిప్రాయ భేదాలకు బూతులే సమాధానమా?**ఇటీవల తెలంగాణ జానపద గాయని మధుప్రియ, యాంకర్ శివజ్యోతిపై రాజ్ బోడా అనే యూట్యూబర్ చేసిన అసభ్య వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. మహిళా కళాకారిణులను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జానపద కళాకారుల వర్గాలు తీవ్రంగా స్పందించాయి. నవంబర్ 12న సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఒక కళాకారిణి పాడిన పాట నచ్చకపోతే విమర్శించవచ్చు. ఆమె రాజకీయ అభిప్రాయాలతో విభేదించవచ్చు. కానీ వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబ సభ్యులను ప్రస్తావిస్తూ అసభ్యంగా దూషించడం ఎంతవరకు సమంజసం? ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుంది. అదే సమయంలో ఇతరుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా ఉంటుంది.విమర్శకు విమర్శతో సమాధానం చెప్పాలి. వాదనకు వాదనతో ఎదుర్కోవాలి. అంతేకానీ మహిళల వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ బూతు పదజాలంతో దాడి చేయడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. సామాజిక మాధ్యమాల్లో కొందరు వ్యక్తులు తమకు నచ్చని అభిప్రాయాలను వ్యక్తం చేసిన మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారి ఫొటోలు, కుటుంబ వివరాలు సేకరించి అవమానించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి ధోరణి వ్యక్తిగత స్వేచ్ఛకు గొడ్డలిపెట్టుగా మారుతోంది.**ఏఐతో అశ్లీల చిత్రాలు.. ప్రమాదకర పరిణామం** కృత్రిమ మేధ సాంకేతికత అందుబాటులోకి రావడంతో డిజిటల్ వేధింపులు మరింత ప్రమాదకరంగా మారాయి. ఇతరుల ముఖాలను ఉపయోగించి వారు చేయని పనులను చేసినట్లుగా చూపించే నకిలీ వీడియోలు, చిత్రాలను సృష్టించడం సులభమైంది. ముఖ్యంగా మహిళల ఫొటోలను ఉపయోగించి అసభ్యకర దృశ్యాలను రూపొందించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. దీనివల్ల బాధితులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. వారి కుటుంబాలు, వ్యక్తిగత జీవితాలు కూడా ప్రభావితమవుతున్నాయి.2023 నవంబర్‌లో నటి రష్మిక మందన్న ముఖాన్ని మరో మహిళ వీడియోకు జోడించి రూపొందించిన డీప్‌ఫేక్ వీడియో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఇటీవల నటి జాన్వీ కపూర్‌ను అసభ్యంగా చూపించేలా ఏఐతో రూపొందించిన వీడియో ప్రచారంలోకి రావడం మరోసారి తీవ్ర ఆందోళన కలిగించింది. దీనిపై పలువురు సినీ ప్రముఖులు స్పందించారు. అనుష్క శెట్టి, కీర్తి సురేష్, శ్రియ శరణ్ తదితర నటీమణుల చిత్రాలను కూడా మార్ఫింగ్ చేసి అసభ్యంగా ఉపయోగిస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి.ఒక మహిళ సినిమా రంగంలో పనిచేస్తున్నా, బహిరంగంగా కనిపిస్తున్నా, సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉన్నా ఆమె వ్యక్తిగత జీవితంపై ఇతరులకు ఎలాంటి అధికారం లభించదు. ఒకరి రూపాన్ని, గొంతును, చిత్రాన్ని వారి అనుమతి లేకుండా ఉపయోగించి అశ్లీల కంటెంట్ సృష్టించడం సృజనాత్మకత కాదు. అది వ్యక్తిగత గోప్యత, ఆత్మగౌరవంపై దాడి. ఏఐ సాంకేతికతను అభివృద్ధికి ఉపయోగించాల్సింది పోయి ఇతరులను అవమానించేందుకు వినియోగించడం సమాజానికి ప్రమాదకరం.**పార్లమెంటరీ నివేదికలో ఆందోళనకర అంశాలు**దేశంలో మహిళలు, పిల్లలపై జరుగుతున్న సైబర్ నేరాల తీవ్రతను పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ నివేదిక స్పష్టం చేసింది. 2026 మార్చి 23న సమర్పించిన నివేదిక ప్రకారం, జాతీయ నేర గణాంకాల సంస్థ వివరాల మేరకు 2017 నుంచి 2022 మధ్య మహిళలపై సైబర్ నేరాలు సుమారు 239 శాతం పెరిగాయి. 2019 నుంచి 2025 ఏప్రిల్ వరకు మహిళలు, పిల్లలకు సంబంధించిన 2.48 లక్షలకు పైగా ఫిర్యాదులు జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదుల పోర్టల్‌కు అందాయి.ఈ గణాంకాలు దేశంలో డిజిటల్ వేధింపులు ఏ స్థాయిలో పెరుగుతున్నాయో తెలియజేస్తున్నాయి. పరువు పోతుందనే భయం, కుటుంబ సభ్యుల ఒత్తిడి, సమాజంలో అవమానానికి గురవుతామనే ఆందోళనతో అనేకమంది బాధితులు పోలీసులను ఆశ్రయించడం లేదు. కొందరు తమపై జరిగిన వేధింపులను బయటకు చెప్పుకోలేక మౌనంగా బాధపడుతున్నారు. ఈ పరిస్థితి నేరగాళ్లకు మరింత ధైర్యాన్ని ఇస్తోంది.ఆన్‌లైన్‌లో వెంటాడటం, నకిలీ ఖాతాలతో వేధించడం, వ్యక్తిగత చిత్రాలను బయటపెడతామని బెదిరించి డబ్బులు లేదా ఇతర ప్రయోజనాలు పొందడం వంటి నేరాలు పెరుగుతున్నాయి. మరోవైపు పోలీసు శాఖల్లో సాంకేతిక నిపుణుల కొరత, డిజిటల్ ఫోరెన్సిక్ సదుపాయాల లోపం, దర్యాప్తులో జాప్యం బాధితులకు న్యాయం అందడంలో అడ్డంకులుగా మారుతున్నాయి. **చట్టాలున్నా అమలులోనే అసలు సమస్య** మహిళలపై సైబర్ వేధింపులను అరికట్టేందుకు దేశంలో చట్టాలు ఉన్నాయి. భారతీయ న్యాయ సంహితలోని 75, 77, 78, 79 సెక్షన్లు, సమాచార సాంకేతిక చట్టంలోని 66ఇ, 67, 67ఎ సెక్షన్లు నేర స్వభావాన్ని బట్టి వర్తిస్తాయి. పిల్లలకు సంబంధించిన లైంగిక కంటెంట్ విషయంలో పోక్సో చట్టం, ఐటీ చట్టంలోని 67బి సెక్షన్ కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంది.అయితే చట్టాలు ఉండటం మాత్రమే సరిపోదు. వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించాలి. డిజిటల్ ఆధారాలు చెరిపివేయకముందే వాటిని సేకరించాలి. నకిలీ ఖాతాల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి. కేసుల దర్యాప్తులో అనవసర జాప్యం లేకుండా చూడాలి. బాధిత మహిళలనే అనుమానిస్తూ ప్రశ్నించడం, వారి వ్యక్తిగత జీవితాన్ని బహిర్గతం చేయడం వంటి చర్యలకు తావివ్వకూడదు.సామాజిక మాధ్యమాల సంస్థల బాధ్యత కూడా తక్కువేమీ కాదు. మహిళలపై అసభ్యకర పోస్టులు, నకిలీ చిత్రాలు, వీడియోలపై ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి వాటిని తొలగించాలి. నేరానికి పాల్పడిన ఖాతాలను గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. బాధితుల ఫిర్యాదులను పట్టించుకోకుండా కాలయాపన చేసే సంస్థలపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. **రాజకీయ పార్టీలు ద్వంద్వ వైఖరి వీడాలి** మహిళలపై సామాజిక మాధ్యమాల్లో దాడులు జరిగినప్పుడు రాజకీయ పార్టీలు తమకు అనుకూలమైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం సరికాదు. అధికార పక్షానికి చెందిన మహిళలైనా, ప్రతిపక్షాలకు చెందిన మహిళలైనా ఒకే విధమైన గౌరవం, రక్షణ లభించాలి. తమ పార్టీ సామాజిక మాధ్యమ విభాగాల్లో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేసే వారిపై పార్టీలు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత దూషణలను ప్రోత్సహించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం.

యూపీలో అధికారం కోసం పార్టీల అంతర్గత పోరు!

- కూటమి ఐక్యతకు సీట్ల పంచాయితీ అడ్డంకి.. బీజేపీకి మూడోసారి అధికారం దక్కేనా?



ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర రాజకీయాలు ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. మరో మూడు, నాలుగు నెలల్లో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అయితే ప్రత్యర్థులను ఎదుర్కోవాల్సిన పార్టీలే ప్రస్తుతం అంతర్గత విభేదాలు, నాయకత్వ సమస్యలు, సీట్ల పంపకాల వివాదాలతో సతమతమవుతున్నాయి. ఈ పరిణామాలు ఆయా పార్టీల విజయావకాశాలపై ప్రభావం చూపే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే ఉత్తరప్రదేశ్‌లో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తుండగా, ఆ పార్టీకి గట్టి పోటీ ఇవ్వాలని సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ సిద్ధమవుతున్నాయి. **బీజేపీలో అంతర్గత అసంతృప్తి**ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి అధికారం నిలబెట్టుకోవడం అత్యంత కీలకంగా మారింది. కేంద్రంలో అధికారంలో ఉన్న కమలదళానికి రాజకీయంగా బలాన్ని అందించే రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్‌ది ప్రత్యేక స్థానం. అందుకే ఈ ఎన్నికల్లో వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేయాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పార్టీ అగ్రనేతలు ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలో తరచూ పర్యటిస్తూ రాజకీయ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. పార్టీ బలాలు, బలహీనతలను అంచనా వేసేందుకు రెండు రోజుల పాటు మేధోమథన సమావేశాలను కూడా నిర్వహిస్తోంది.అయితే బీజేపీకి బయట నుంచి ఎదురయ్యే సవాళ్ల కంటే పార్టీలోని అంతర్గత సమస్యలే ఎక్కువ ఆందోళన కలిగిస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మధ్య సమన్వయం సరిగా లేకపోవడం పార్టీకి నష్టం కలిగించింది. ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో సమన్వయాన్ని బలోపేతం చేయాలని ప్రయత్నిస్తోంది. పోలింగ్ బూత్ స్థాయి నుంచి పార్టీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంపై దృష్టి సారించింది.మరోవైపు పార్టీ కోసం మొదటి నుంచి పనిచేస్తున్న పాత కార్యకర్తలను పక్కనపెట్టి కొత్తవారికి ప్రాధాన్యత ఇస్తున్నారనే అసంతృప్తి పెరుగుతోంది. క్షేత్రస్థాయిలో కార్యకర్తల్లో నిర్లిప్తత, అలసత్వం కనిపిస్తున్నాయి. స్థానిక నాయకుల మధ్య విభేదాలు కూడా పార్టీకి ఇబ్బందిగా మారుతున్నాయి. ఎన్నికల సమయంలో కార్యకర్తలే పార్టీకి ప్రధాన బలంగా ఉంటారు. అలాంటి కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగితే ప్రచారం నుంచి పోలింగ్ వరకు ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఈ సమస్యలను సకాలంలో పరిష్కరించుకోవడం బీజేపీ ముందున్న ప్రధాన సవాలు.**సమాజ్‌వాదీ పార్టీకి కొత్త ఉత్సాహం**ఇటీవల జరిగిన శాసనమండలి ఎన్నికల ఫలితాలు సమాజ్‌వాదీ పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. మొత్తం 11 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఆరు స్థానాలు గెలుచుకోగా, సమాజ్‌వాదీ పార్టీ ఐదు స్థానాలను దక్కించుకుంది. ఈ ఫలితాలు రాష్ట్రంలో ప్రతిపక్షానికి ఇంకా బలమైన ఓటు బ్యాంకు ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా వెనుకబడిన తరగతులు, దళితులు, మైనార్టీలను కలుపుకొని సామాజిక సమీకరణాలను బలోపేతం చేయడంలో సమాజ్‌వాదీ పార్టీ చేస్తున్న ప్రయత్నాలు ఆ పార్టీకి కలిసివచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి.రాష్ట్రంలో బీజేపీకి ప్రధాన ప్రత్యర్థిగా సమాజ్‌వాదీ పార్టీ కొనసాగుతోంది. గత ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఆ పార్టీకి కాంగ్రెస్ కంటే మెరుగైన ప్రజాదరణ ఉన్నట్లు స్పష్టమవుతోంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ 347 స్థానాల్లో పోటీ చేసి 111 స్థానాలను గెలుచుకుంది. సుమారు 32 శాతం ఓట్లను సాధించింది. ఈ బలాన్ని మరింత పెంచుకుని అధికారాన్ని కైవసం చేసుకోవాలని ఆ పార్టీ నాయకత్వం భావిస్తోంది. అయితే మిత్రపక్షమైన కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల విషయంలో ఏర్పడుతున్న విభేదాలు సమాజ్‌వాదీ పార్టీకి కొత్త తలనొప్పిగా మారాయి.**కాంగ్రెస్ అత్యాశ కూటమికి ఇబ్బందా?**బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావాల్సిన సమయంలో కాంగ్రెస్ వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారుతోంది. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 403 అసెంబ్లీ స్థానాలు ఉండగా, వాటిలో 189 నుంచి 200 స్థానాల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది.

అయితే గత ఎన్నికల్లో ఆ పార్టీ సాధించిన ఫలితాలను పరిశీలిస్తే ఈ డిమాండ్ వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 399 స్థానాల్లో పోటీ చేసి కేవలం 2.33 శాతం ఓట్లను మాత్రమే సాధించింది. రెండు స్థానాలకే పరిమితమైంది. అదే సమయంలో సమాజ్‌వాదీ పార్టీ 111 స్థానాలను గెలుచుకుని 32 శాతం ఓట్లను సాధించింది. ఈ నేపథ్యంలో కూటమిలో ఎక్కువ స్థానాల కోసం కాంగ్రెస్ పట్టుబట్టడం రాజకీయంగా ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం రాజకీయ పరిస్థితుల్లో మార్పులు వచ్చాయని, యువత సమస్యలు, ప్రజాస్వామ్య పరిరక్షణ అంశాలపై తాము చేస్తున్న పోరాటం ప్రజల్లో తమకు ఆదరణ పెంచుతోందని కాంగ్రెస్ భావిస్తోంది.హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో గతంలో కోల్పోయిన రాజకీయ ప్రాబల్యాన్ని తిరిగి సాధించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ముందుకు సాగుతోంది.

ఈ ప్రయత్నంలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని కోరుతోంది. కానీ రాష్ట్రవ్యాప్తంగా బలమైన పార్టీ నిర్మాణం లేకపోవడం కాంగ్రెస్‌కు ప్రధాన బలహీనతగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణం బలంగా లేకుండా ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవచ్చు.

గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలిప్రతిపక్ష కూటమిలో సీట్ల పంపకాల వివాదాలు కొత్తవేమీ కావు. గతంలో బీహార్‌లో మహాగఠ్‌బంధన్ ప్రభుత్వ వ్యతిరేకతను పూర్తిస్థాయిలో తమకు అనుకూలంగా మలుచుకోలేకపోయింది. ఆర్జేడీ, కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్న సామాజిక వర్గాల ఓట్లను సమర్థవంతంగా ఏకం చేయడంలో విఫలమైంది. సీట్ల పంపకాలలో జాప్యం, ప్రచారంలో సమన్వయ లోపాలు కూడా కూటమి విజయావకాశాలను దెబ్బతీశాయి.తమిళనాడులోనూ డీఎంకే నుంచి ఎక్కువ స్థానాలు కావాలని కాంగ్రెస్ పట్టుబట్టడంతో కూటమి ఒప్పందం ఆలస్యమైంది. పార్టీలోని అంతర్గత విభేదాల కారణంగా ఆశించిన స్థాయిలో ఎన్నికల ప్రచారం సాగలేదు. ఫలితంగా కూటమిలోని ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్ పోటీ చేసిన స్థానాల్లో తక్కువ ఓటు శాతాన్ని సాధించింది. ఈ అనుభవాలన్నీ ఉత్తరప్రదేశ్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలకు గుణపాఠాలుగా నిలవాలి.ఎన్నికల్లో విజయం సాధించాలంటే కేవలం సీట్ల సంఖ్య మాత్రమే ముఖ్యం కాదు. ఏ పార్టీకి ఏ ప్రాంతంలో బలం ఉంది? ఏ అభ్యర్థికి ప్రజాదరణ ఉంది? సామాజిక సమీకరణాలు ఎలా ఉన్నాయి? అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని సీట్ల పంపకాలు జరగాలి. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కంటే కూటమి లక్ష్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. లేకపోతే బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోయి అధికార పార్టీకి లాభం చేకూరే అవకాశం ఉంది.**ఐక్యతే ప్రతిపక్షాలకు అసలైన బలం** ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని ఎదుర్కోవాలంటే ప్రతిపక్ష పార్టీలన్నీ ఒకే ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ప్రజా సమస్యలు, నిరుద్యోగం, యువత భవిష్యత్తు, ఎన్నికల ప్రజాస్వామ్యం వంటి అంశాలను ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కేవలం బీజేపీ వ్యతిరేకతతోనే ఎన్నికల్లో విజయం సాధించడం సాధ్యం కాదు. ప్రజలకు నమ్మకం కలిగించే ప్రత్యామ్నాయ విధానాలు, స్పష్టమైన ఎన్నికల ప్రణాళికను ప్రతిపక్షాలు ప్రకటించాలి.సమాజ్‌వాదీ పార్టీకి రాష్ట్రంలో ఉన్న బలాన్ని కాంగ్రెస్ గుర్తించాలి. అదే సమయంలో కాంగ్రెస్‌కు ఉన్న జాతీయ స్థాయి ప్రాధాన్యతను సమాజ్‌వాదీ పార్టీ కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పరస్పర గౌరవం, రాజకీయ వాస్తవాల ఆధారంగా సీట్ల పంపకాలు జరగాలి. సుమారు 100 స్థానాల్లో వ్యూహాత్మకంగా పోటీ చేయడం కాంగ్రెస్‌కు వాస్తవికమైన మార్గమనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.ఇదిలా ఉండగా, అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం కూడా ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. ఈ పార్టీ పోటీతో కొన్ని నియోజకవర్గాల్లో ఓట్ల చీలిక ఏర్పడే అవకాశాలున్నాయి. ముఖ్యంగా మైనార్టీ ఓట్లలో చీలిక వస్తే ప్రతిపక్ష కూటమి విజయావకాశాలపై ప్రభావం పడవచ్చు. అందువల్ల కూటమి నాయకులు ఈ అంశాన్ని కూడా ముందుగానే పరిగణనలోకి తీసుకోవాలి.**ప్రజల విశ్వాసమే అంతిమ విజయం**

ఉత్తరప్రదేశ్ ఎన్నికలు కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన రాజకీయ పోటీ మాత్రమే కాదు. దేశ రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక ఎన్నికలు. బీజేపీకి ఈ ఎన్నికల్లో విజయం సాధించడం రాజకీయంగా ఎంతో ప్రతిష్ఠాత్మకం. మరోవైపు ప్రతిపక్షాలకు తమ ఐక్యతను నిరూపించుకోవడానికి ఇదొక కీలక అవకాశం. ఇలాంటి సమయంలో అంతర్గత విభేదాలు, సీట్ల కోసం పట్టింపులు, నాయకుల మధ్య ఆధిపత్య పోరు కొనసాగితే ప్రతిపక్షాలే తమ అవకాశాలను చేజేతులా దెబ్బతీసుకున్నట్లవుతుంది.

రైతన్నకు భరోసా.. వ్యవసాయానికి కొత్త దిశ!


ఎల్‌నినోతో తీవ్ర నీటి సంక్షోభం.. తగ్గనున్న యాసంగి సాగు విస్తీర్ణం

ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధరలు కల్పించాలి



తెలంగాణ వ్యవసాయ రంగం ప్రస్తుతం ఎన్నడూ లేనంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటిపోవడం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత ఏడాది యాసంగి సీజన్‌లో పచ్చని పైర్లతో కళకళలాడిన పొలాలు ఈసారి నీటి కొరతతో వెలవెలబోయే పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయానికి ప్రధాన ఆధారమైన నీటి వనరులు తగ్గిపోవడంతో రైతులు ఏ పంట సాగు చేయాలో తెలియక సందిగ్ధంలో పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు కేవలం సూచనలు, ఆదేశాలు ఇవ్వడం కాకుండా ప్రభుత్వం ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలిచి భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయానికి గండం**రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా మారుతున్నాయి. ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో పాటు భూగర్భ జలాలు కూడా అడుగంటిపోతున్నాయి. బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు నీటి లభ్యత తగ్గుతోంది. గత ఏడాది యాసంగి సీజన్‌లో సుమారు 68.67 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఈసారి ఆ విస్తీర్ణం 25 లక్షల ఎకరాల్లోపే ఉండవచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. అంటే సాగు విస్తీర్ణంలో భారీ తగ్గుదల నమోదయ్యే ప్రమాదం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 31 జిల్లాల్లోని 365 మండలాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించింది. వ్యవసాయ నిపుణుల అంచనాల ప్రకారం నీటి, విద్యుత్ సంక్షోభం 2027 జులై వరకు కొనసాగితే రైతాంగానికి మరిన్ని ఇబ్బందులు తప్పవు.ఈ పరిస్థితులు కేవలం పంటల సాగుకే పరిమితం కావు. వ్యవసాయ కూలీల ఉపాధి, గ్రామీణ వ్యాపారాలు, రైతుల కొనుగోలు శక్తి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయి. సాగు తగ్గితే వ్యవసాయ ఆధారిత కుటుంబాల ఆదాయం పడిపోతుంది. అప్పులు, పెట్టుబడులు, కుటుంబ అవసరాలు రైతులకు భారంగా మారతాయి. అందువల్ల నీటి సంక్షోభాన్ని వ్యవసాయ సమస్యగా మాత్రమే చూడకుండా గ్రామీణ జీవన వ్యవస్థను ప్రభావితం చేసే విస్తృత సమస్యగా గుర్తించాలి.**వరి సాగుకు ప్రత్యామ్నాయమే పరిష్కారం**తెలంగాణ రైతులు అనేక సంవత్సరాలుగా వరి సాగుకు అలవాటు పడ్డారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో వరి ప్రధాన పంటగా కొనసాగుతోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అధిక నీరు అవసరమయ్యే వరి సాగును విస్తృతంగా చేపట్టడం సాధ్యం కాదు. నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఏర్పడింది.పెసలు, మినుములు, శనగలు, కందులు, జొన్నలు, నువ్వులు, సజ్జలు, రాగులు వంటి పంటలు తక్కువ నీటితో సాగు చేయడానికి అనుకూలంగా ఉంటాయి.

కోహ్లీ రిటైర్మెంట్‌పై కపిల్ దేవ్ సంచలన వ్యాఖ్యలు!



టెస్టులకు వీడ్కోలు పలకడం కెరీర్‌లోనే పెద్ద తప్పిదం
పదేళ్ల తర్వాత తన నిర్ణయంపై కోహ్లీ బాధపడతాడన్న దిగ్గజ క్రికెటర్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ దిగ్గజం, 1983 ప్రపంచకప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. టెస్టులకు వీడ్కోలు పలకడం కోహ్లీ కెరీర్‌లోనే అతిపెద్ద తప్పిదమని అభిప్రాయపడ్డారు. పదేళ్ల తర్వాత తన నిర్ణయంపై కోహ్లీ పశ్చాత్తాపపడతాడని వ్యాఖ్యానించారు. అద్భుతమైన ఫిట్‌నెస్ కలిగిన కోహ్లీ మరికొంత కాలం టెస్టు క్రికెట్‌లో కొనసాగాల్సిందని పేర్కొన్నారు.మిడ్‌డేతో మాట్లాడిన కపిల్ దేవ్.. కోహ్లీ ఫిట్‌నెస్ ఏ ఇతర ఆటగాడికీ తీసిపోదని, 25 ఏళ్ల యువ క్రికెటర్‌తోనూ పోటీపడగల సామర్థ్యం అతనికి ఉందని ప్రశంసించారు. ఇంతటి శారీరక సామర్థ్యం ఉన్న ఆటగాడు టెస్టులకు వీడ్కోలు పలకడం సరైన నిర్ణయం కాదన్నారు.**మోహిందర్ అమర్‌నాథ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి**కష్టకాలంలో ఆగ్రహంతో రిటైర్మెంట్ నిర్ణయాలు తీసుకోవడం సరికాదని కపిల్ హితవు పలికారు. మాజీ క్రికెటర్ మోహిందర్ అమర్‌నాథ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అమర్‌నాథ్ పలుమార్లు జట్టులో స్థానం కోల్పోయినా తిరిగి పుంజుకుని తన ప్రతిభను నిరూపించుకున్నారని గుర్తుచేశారు. ఆటగాళ్లు కూడా విమర్శలు, ఒడిదుడుకులకు కుంగిపోకుండా తిరిగి జట్టులో స్థానం సంపాదించేందుకు ప్రయత్నించాలని అన్నారు.**123 టెస్టుల్లో 9,230 పరుగులు** విరాట్ కోహ్లీ 2025 మే 12న టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. 14 ఏళ్ల టెస్టు కెరీర్‌లో 123 మ్యాచ్‌లు ఆడి 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించారు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధసెంచరీలు ఉన్నాయి. అంతకుముందు 2024 టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు కూడా వీడ్కోలు పలికారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు.కోహ్లీతో పాటు రోహిత్ శర్మ భవిష్యత్తుపైనా కపిల్ దేవ్ స్పందించారు. ఆటగాళ్ల భవిష్యత్తును ఎంపిక సంఘమే నిర్ణయించాలని, దేశానికి సేవలందించిన ప్రతి ఆటగాడూ ఏదో ఒక దశలో ఆటకు వీడ్కోలు పలకాల్సిందేనని పేర్కొన్నారు.

ధోనీ అభిమానులకు భారీ షాక్!



- ఐపీఎల్‌కు ఆటగాడిగా వీడ్కోలు..
చెన్నై సూపర్ కింగ్స్‌కు కొత్త బాధ్యతల్లో ధోనీ

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ అభిమానులకు షాకింగ్ న్యూస్. ఐపీఎల్‌లో ఆటగాడిగా తన ప్రస్థానానికి ధోనీ ముగింపు పలికారు. 2027 ఐపీఎల్ సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. అయితే ఆటగాడిగా తప్పుకున్నప్పటికీ ధోనీ చెన్నై జట్టుతోనే కొనసాగనున్నారు. ఇకపై జట్టుకు మెంటార్‌గా వ్యవహరించనున్నారు.**మెంటార్‌గా కొత్త బాధ్యతలు** 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు ధోనీ కీలక ఆటగాడిగా కొనసాగారు. ఆయన నాయకత్వంలో సీఎస్కే ఐదు ఐపీఎల్ టైటిళ్లను సాధించింది. ధోనీ రిటైర్మెంట్‌పై జట్టు యాజమాన్యం భావోద్వేగ స్పందన తెలిపింది. ధోనీ లేకుండా చెన్నై సూపర్ కింగ్స్‌ను ఊహించలేమని జట్టు యజమాని ఎన్. శ్రీనివాసన్ పేర్కొన్నారు. 2008లో ధోనీని జట్టులోకి తీసుకోవడం తన అత్యుత్తమ నిర్ణయమని కొనియాడారు.**గాయాల కారణంగా నిర్ణయం** గత కొంతకాలంగా గాయాలతో ఇబ్బందిపడుతున్న ధోనీ 2026 ఐపీఎల్ సీజన్ మొత్తానికి దూరంగా ఉన్నారు. తన శారీరక సామర్థ్యాన్ని పరీక్షించుకున్న అనంతరం ఆటగాడిగా కొనసాగడం కష్టమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మెంటార్‌గా యువ ఆటగాళ్లకు తన అనుభవాన్ని పంచుకోనున్నారు.**ఐపీఎల్‌లో ధోనీ ఘనతలు**ధోనీ మొత్తం 278 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 5,439 పరుగులు సాధించారు. కెప్టెన్‌గా 235 మ్యాచ్‌లకు నాయకత్వం వహించి 136 విజయాలు అందించారు. 2010, 2011, 2018, 2021, 2023లో చెన్నైకి ఐదు టైటిళ్లు అందించారు. ఆటగాడిగా మైదానంలో కనిపించకపోయినా మెంటార్‌గా చెన్నై జట్టుతో కొన సాగనుండటంతో అభిమానులకు కొంత ఊరట లభించనుంది.

కివీస్‌పై పేస్ దాడికి గిల్ వ్యూహం!

నలుగురు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి భారత్.. తుది జట్టుపై కెప్టెన్ కసరత్తు

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌లో భారత జట్టు నలుగురు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి దిగనుంది. ఈ విషయాన్ని భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశారు. గురువారం (నవంబర్ 19) నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టుకు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ జట్టు కూర్పుపై వివరాలు వెల్లడించారు. ఏడుగురు ప్రధాన బ్యాటర్లతో పాటు నలుగురు పేసర్లను ఆడించాలని నిర్ణయించినట్లు తెలిపారు.**పేసర్ల ఎంపికపై తర్జనభర్జన** ప్రస్తుతం భారత జట్టులో ఫాస్ట్ బౌలర్లందరూ మంచి ఫామ్‌లో ఉండటంతో తుది జట్టును ఎంపిక చేయడం కష్టంగా మారిందని గిల్ అన్నారు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్ వంటి బౌలర్లు అందుబాటులో ఉన్నారు. వీరిలో ఎవరిని ఎంపిక చేయాలన్నది జట్టు యాజమాన్యానికి సవాలుగా మారిందని పేర్కొన్నారు.మ్యాచ్ తొలి రెండు రోజుల్లో పిచ్ నుంచి పేసర్లకు సహకారం లభించే అవకాశం ఉందని, మూడో రోజు నుంచి వికెట్ నెమ్మదిగా మారుతుందని గిల్ వివరించారు. పాత బంతితోనూ వికెట్లు తీయగలిగే వేగవంతమైన బౌలర్లు జట్టుకు



అవసరమని తెలిపారు. బలమైన గాలులు వీచే పరిస్థితుల్లో బౌలర్లపై అదనపు ఒత్తిడి ఉంటుందని, అందుకు అనుగుణంగా బౌలింగ్ కూర్పును నిర్ణయిస్తామని చెప్పారు.**ఏడుగురు బ్యాటర్లతో బరిలోకి**జట్టులో ఏడుగురు ప్రధాన బ్యాటర్లను ఆడించాలని భావిస్తున్నట్లు గిల్ వెల్లడించారు. ఎనిమిది, తొమ్మిది స్థానాల్లో బ్యాటింగ్ చేయగల బౌలర్లను ఎంపిక చేయడంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఆకాశ్ దీప్, అన్షుల్ కాంబోజ్ బ్యాటింగ్ చేయగలరని, నితీశ్ కుమార్ రెడ్డి కూడా మంచి బ్యాటర్ అని పేర్కొన్నారు. జట్టు అవసరాలకు అనుగుణంగా తుది కూర్పును నిర్ణయిస్తామని చెప్పారు.**రిషభ్ పంత్‌కు కెప్టెన్ మద్దతు**వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఫిట్‌నెస్, ఫామ్‌పై వస్తున్న సందేహాలను గిల్ తోసిపుచ్చారు. సుమారు 50 టెస్టులు ఆడిన అనుభవం పంత్‌కు ఉందని, విదేశీ గడ్డలపై కూడా అద్భుతంగా రాణించాడని ప్రశంసించారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లలో సెంచరీలు సాధించిన పంత్‌పై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు.**డబ్ల్యూటీసీ ఫైనలే లక్ష్యం** న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల్లోనూ విజయం సాధిస్తే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకునే అవకాశాలు మెరుగవుతాయని గిల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్‌కు మెరుగైన సన్నద్ధత కల్పించేందుకే వన్డే జట్టు నుంచి కొందరు ఆటగాళ్లను ముందుగానే విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పటికే టీ20, వన్డే సిరీస్‌లను గెలిచిన భారత్ టెస్టు సిరీస్‌ను కూడా కైవసం చేసుకుని న్యూజిలాండ్ పర్యటనను ఘనంగా ముగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



అంతర్జాతీయ స్థాయిలో మను భాకర్‌కు
అరుదైన గుర్తింపు!

- **20262030 కాలానికి ఐఎస్ఎస్ఎఫ్ అథ్లెట్ల కమిటీలో సభ్యురాలిగా ఎన్నిక**
- **క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి ప్రపంచ వేదికపై ప్రాతినిధ్యం**

న్యూఢిల్లీ: భారత షూటింగ్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత మను భాకర్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడల సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) అథ్లెట్ల కమిటీ సభ్యురాలిగా ఆమె ఎన్నికయ్యారు. 2026 నుంచి 2030 వరకు నాలుగేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ విషయాన్ని భారత జాతీయ రైఫిల్ సంఘం అధికారికంగా వెల్లడించింది.**22 మంది అభ్యర్థుల నుంచి ఎన్నిక** ప్రపంచవ్యాప్తంగా 20 దేశాలకు చెందిన 22 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీపడ్డారు. రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం ఆరుగురు సభ్యులను క్రీడాకారుల ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు ఈజిప్టలోని కైరో, ఖతార్‌లోని దోహాలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల సందర్భంగా ఆన్‌లైన్‌లో నిర్వహించారు. పిస్టల్ విభాగానికి ప్రాతినిధ్యం వహిస్తూ మను భాకర్ ఈ పదవిని దక్కించుకున్నారు.**క్రీడాకారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం** తన ఎన్నికపై మను భాకర్ సంతోషం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన తోటి షూటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ క్రీడాకారుల సమస్యలు, అవసరాలు సమర్థవంతంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పోటీ నిబంధనలు, షెడ్యూళ్లలో స్పష్టత తీసుకురావడంతో పాటు క్రీడాకారులకు మెరుగైన సహాయక వ్యవస్థలు కల్పించేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడం కూడా తన లక్ష్యమని తెలిపారు.**ఒలింపిక్ పతకాలతో ప్రత్యేక గుర్తింపు** 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మను భాకర్ రెండు కాంస్య పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన స్వతంత్ర భారత తొలి క్రీడాకారిణిగా గుర్తింపు పొందారు. ఆమె ఎన్నికతో అంతర్జాతీయ షూటింగ్ రంగంలో భారత క్రీడాకారుల గొంతుకకు మరింత ప్రాధాన్యత లభించనుంది. 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు ముందు ఆమెకు ఈ బాధ్యత దక్కడం విశేషం.

రాజస్థాన్ రాయల్స్‌లోకి మహ్మద్ షమీ..!

ఐపీఎల్-2027కు ముందే కీలక ఆటగాళ్ల బదిలీ
లఖ్‌నవూతో రాజస్థాన్ మల్టీ ప్లేయర్ ట్రేడ్ డీల్.. శామ్ కరన్ మరో జట్టుకు


న్యూఢిల్లీ: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందే జట్ల మధ్య ఆటగాళ్ల మార్పిడి ప్రక్రియ ఆసక్తికరంగా మారింది. ఇందులో భాగంగా రాజస్థాన్ రాయల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్ల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ మల్టీ ప్లేయర్ ట్రేడ్ డీల్‌లో భాగంగా భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరగా, ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ శామ్ కరన్ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు మారాడు. వీరితో పాటు స్పిన్నర్ ఎం. సిద్ధార్థ్ కూడా రాజస్థాన్ జట్టులోకి వచ్చాడు. వచ్చే సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలనే లక్ష్యంతో రెండు జట్లు తమ ఆటగాళ్ల బలాబలాలను మార్చుకుంటున్నాయి.**రూ.8 కోట్లకు షమీ కొనుగోలు** ఈ ఒప్పందంలో ప్రధాన ఆకర్షణ మహ్మద్ షమీ. 35 ఏళ్ల ఈ భారత పేసర్‌ను రాజస్థాన్ రాయల్స్ రూ.8 కోట్లకు సొంతం చేసుకుంది. గతంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ షమీని రూ.10 కోట్లకు తీసుకుంది. తాజా ట్రేడ్ ఒప్పందంలో అతడి ధర



రూ.2 కోట్లు తగ్గింది. అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష అనుభవం ఉన్న షమీ రాకతో రాజస్థాన్ బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూరనుంది.షమీకి కొత్త బంతితో వికెట్లు తీయడంలో ప్రత్యేక నైపుణ్యం ఉంది. ముఖ్యంగా పవర్‌ప్లేలో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేయగలడు. బంతిని రెండు వైపులా స్వింగ్ చేయడంతో పాటు కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయడం అతడి ప్రత్యేకత. అనుభవజ్ఞుడైన బౌలర్ కావడంతో కీలక సమయాల్లో జట్టుకు ఉపయోగపడే అవకాశం ఉంది.**ఐపీఎల్‌లో షమీ ఘన గణాంకాలు** మహ్మద్ షమీ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 132 మ్యాచ్‌లు ఆడి 145 వికెట్లు పడగొట్టాడు. పవర్‌ప్లేలో వికెట్లు సాధించడంలో అతడికి మంచి రికార్డు ఉంది. కొత్త బంతితో పాటు పాత బంతితోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం షమీ సొంతం. అతడి అనుభవం రాజస్థాన్ యువ బౌలర్లకు కూడా ఉపయోగపడనుంది. వచ్చే సీజన్‌లో రాజస్థాన్ తరఫున షమీ ఎలా రాణిస్తాడన్నది క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.**లఖ్‌నవూకు శామ్ కరన్ అస్త్రం** మరోవైపు రాజస్థాన్ రాయల్స్ నుంచి ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ శామ్ కరన్ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌లో చేరాడు. అతడిని రూ.2.4 కోట్ల ధరతో లఖ్‌నవూ దక్కించుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ రాణించగల సామర్థ్యం కరన్ ప్రత్యేకత. అవసరమైన సమయంలో వేగంగా పరుగులు సాధించడంతో పాటు బౌలింగ్‌లోనూ కీలక వికెట్లు తీయగలడు.కరన్ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 997 పరుగులు చేయడంతో పాటు 59 వికెట్లు సాధించాడు. ఆల్‌రౌండర్‌గా అతడి సేవలు లఖ్‌నవూ జట్టుకు ఉపయోగపడనున్నాయి. జట్టు కూర్పులో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలకు సమతుల్యత తీసుకురావడంలో కరన్ కీలకంగా మారే అవకాశముంది.

నెట్‌ఫ్లిక్స్‌లో 'రణబాలి' ప్రభంజనం..
విజయ్ నటనకు ప్రేక్షకుల ప్రశంసలు!

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన చారిత్రక నేపథ్య యాక్షన్ చిత్రం 'రణబాలి' ఓటీటీలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. థియేటర్లలో విడుదలైన తర్వాత మిశ్రమ స్పందన అందుకున్న ఈ చిత్రం.. నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చిన అనంతరం మరోసారి వార్తల్లో నిలిచింది. నవంబర్ 13 నుంచి తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సినిమాకు వివిధ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి స్పందన లభిస్తోంది. **టాప్-10 జాబితాలో రెండో స్థానం** నెట్‌ఫ్లిక్స్ ఇండియా సినిమా విభాగంలో 'రణబాలి' రెండో స్థానానికి చేరినట్లు సినీ వర్గాల కథనాలు వెల్లడించాయి. థియేటర్లలో సినిమా చూడలేకపోయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో వీక్షిస్తున్నారు. ముఖ్యంగా హిందీ ప్రేక్షకుల నుంచి కూడా ఆసక్తి కనిపిస్తుండటంతో సినిమాకు కొత్త ప్రేక్షకులు చేరుతున్నారు. డిజిటల్ విడుదలతో ఈ చిత్రంపై చర్చ మళ్లీ మొదలైంది. **విజయ్ నటనకు ప్రశంసలు** ఈ సినిమాలో విజయ్ దేవరకొండ చేసిన శారీరక మార్పు, కఠినమైన రూపం, ఆవేశభరితమైన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. పాత్రలోని తీవ్రతను తెరపై చూపించిన తీరు అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని 'గాడ్ సీన్' సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేకంగా చర్చకు వస్తోంది. ఆ సన్నివేశంలో విజయ్ ప్రదర్శించిన నటన, తెరపై ఆయన ఉనికి అద్భుతంగా ఉన్నాయంటూ పలువురు అభిమానులు స్పందిస్తున్నారు. కొందరు ఆయనకు జాతీయ అవార్డు రావాలని కూడా అభిప్రాయపడుతున్నారు. **రష్మిక నటనపైనా చర్చ** ఈ చిత్రంలో జయమ్మ పాత్రలో నటించిన రష్మిక మందన్నకు కూడా మంచి స్పందన లభిస్తోంది. విజయ్, రష్మికల మధ్య తెరపై కనిపించిన అనుబంధం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ప్రధాన జంట నటనతో పాటు దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కథను తెరకెక్కించిన విధానంపై కూడా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. **బ్రిటన్‌లోనూ చర్చకు దారితీసిన కథాంశం** బ్రిటిష్ వలస పాలన కాలంలో జరిగిన ఘటనల నేపథ్యంతో రూపొందిన ఈ సినిమా విదేశీ ప్రేక్షకుల దృష్టిని కూడా ఆకర్షిస్తోంది.





పాత్ర కోసం జుట్టు కత్తిరించుకున్న సాయి పల్లవి!

- కొత్త లుక్ చూసి షాకైన తల్లి.. వీడియో కాల్ కట్
- విగ్గు పెట్టుకున్నావా అంటూ ఆరా తీసిన తండ్రి

హైదరాబాద్: సహజ నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న హీరోయిన్ సాయి పల్లవి తన కొత్త సినిమా కోసం చేసిన సాహసోపేతమైన మార్పు ఆసక్తికరంగా మారింది. ధనుష్ హీరోగా నటిస్తున్న 'ఓం: చాప్టర్ 1 ఉధిరమ్: ది బ్లడ్ వుడ్' సినిమా కోసం ఆమె తన పొడవాటి జుట్టును కత్తిరించుకున్నారు. అయితే సాయి పల్లవి తీసుకున్న ఈ నిర్ణయం ఆమె తల్లిదండ్రులకు ఆశ్చర్యం కలిగించింది. ముఖ్యంగా కొత్త లుక్ చూసిన తల్లి షాక్‌కు గురై వీడియో కాల్ కట్ చేశారట. ఈ విషయాన్ని సాయి పల్లవే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. **పాత్ర కోసం పూర్తిగా మారిపోయా** దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి చెప్పిన కథ తనకు బాగా నచ్చిందని సాయి పల్లవి తెలిపారు. సినిమాలోని పాత్రకు తగ్గట్టుగా తన రూపాన్ని మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఇందులో ఆమె నిత్యారెడ్డి అనే పోలీసు అధికారిణి పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం దర్శకుడు నిజ జీవిత ఐపీఎస్ అధికారి మెరిన్ జోసెఫ్ రూపాన్ని స్ఫూర్తిగా తీసుకున్నారు. ఆమె మాదిరిగా చిన్న జుట్టుతో కనిపించాలనే ఉద్దేశంతో సాయి పల్లవి నిజంగానే జుట్టు కత్తిరించుకున్నారు. **తల్లి షాక్.. తండ్రికి అనుమానం** జుట్టు కత్తిరించుకున్న తర్వాత తన కొత్త రూపాన్ని ముందుగా తల్లికి వీడియో కాల్‌లో చూపించానని సాయి పల్లవి చెప్పారు. తనను ఆ రూపంలో చూసిన తల్లి ఒక్కసారిగా ఆశ్చర్యపోయి ఎందుకు జుట్టు కత్తిరించుకున్నావంటూ ప్రశ్నించారని, ఆ తర్వాత ఫోన్ పెట్టేశారని తెలిపారు. అనంతరం తండ్రి ఫోన్ చేసి, పల్లవి.. అది విగ్గు కదా? అని అడిగారని చెప్పారు. తాను నిజంగానే జుట్టు కత్తిరించుకున్నానని, సినిమా పాత్ర కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని వివరించానన్నారు. కొత్త రూపానికి అలవాటు పడటానికి తల్లిదండ్రులకు కొంత సమయం పట్టిందని నవ్వుతూ వెల్లడించారు. **నవంబర్ 20న సినిమా విడుదల** రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ధనుష్, మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యంలో సాగే కథలో సాయి పల్లవి పోలీసు అధికారిణిగా

అది అప్పుడూ ఉంది.. ఇప్పుడూ ఉంది
: కాస్టింగ్ కౌచ్‌పై రమ్యకృష్ణ షాకింగ్ కామెంట్స్!

సినీ పరిశ్రమలో ఎప్పటినుంచో చర్చనీయాంశంగా ఉన్న 'కాస్టింగ్ కౌచ్'పై సీనియర్ నటి రమ్యకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. చిత్ర పరిశ్రమలో ఈ తరహా వేధింపులు అప్పుడూ ఉన్నాయని, ఇప్పుడూ ఉన్నాయని, భవిష్యత్తులో కూడా ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఈ దోపిడీ కేవలం ఒక పరిశ్రమకే పరిమితం కాదని, లింగ భేదం లేకుండా అన్ని రంగాల్లోనూ జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. "అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశంలోనే ఎప్‌స్టీన్ ఫైల్స్ లాంటివి బయటపడ్డాయి. అక్కడ మహిళలు ఎంతో ముందున్నా అలాంటివి ఎదుర్కోవాల్సి వచ్చింది. కాబట్టి ఇక్కడ జరగదని చెప్పలేం. ఇష్టంతోనో, బలవంతంగానో, మామూలుగానో.. అది జరుగుతూనే ఉంటుంది. దీన్ని ఎవరూ కాదనలేరు. మనది గ్లామర్ ప్రపంచం కాబట్టి దీని గురించి ఎక్కువగా మాట్లాడుకుంటారు. బయట కూడా ఎంతోమంది మహిళలు ఇలాంటివి ఎదుర్కొంటున్నారు" అని వివరించారు.గతంలో చిత్ర పరిశ్రమలో తాము ఎదుర్కొన్న కష్టాలను కూడా రమ్యకృష్ణ గుర్తుచేసుకున్నారు. ఆ రోజుల్లో ఫిల్మ్ సెట్లలో కనీసం వాష్‌రూమ్‌లు, క్యారవాన్‌లు ఉండేవి కావని తెలిపారు. బట్టలు మార్చుకోవడానికి కూడా సరైన ప్రైవసీ ఉండేది కాదని, అంబాసిడర్ కార్లలో కూర్చుని బాటిళ్లలోనే మూత్ర విసర్జన చేసిన సందర్భాలున్నాయని చెప్పారు. ఆ కష్టాలతో పోలిస్తే ఇప్పటి నటీనటులు చాలా అదృష్టవంతులని, తాము పడిన కష్టాల్లో పావు వంతు కూడా వారు అనుభవించలేదని అన్నారు.ఇక, సినిమాల విషయానికొస్తే.. రమ్యకృష్ణ ఇటీవల రజనీకాంత్‌తో కలిసి 'జైలర్ 2'లో నటించారు. వీటితో పాటు 'రాకా', 'శ్రీ శ్రీ', 'పాకెట్ నావెల్', 'తేరా యార్ హూ మే' వంటి చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి



ఎన్టీఆర్ అభిమానులకు డబుల్ ధమాకా!



ఒకేసారి రెండు సినిమాలతో తారక్ సందడి.. ప్రశాంత్ నీల్, త్రివిక్రమ్, అనిల్ రావిపూడితో భారీ ప్రాజెక్టులు

హైదరాబాద్: మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు వరుస శుభవార్తలు అందుతున్నాయి. ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్న తారక్ మరో క్రేజీ ప్రాజెక్టుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమాతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పిన ఆయన, ఆ తర్వాత మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో మరో ప్రతిష్ఠాత్మక చిత్రంలో నటించనున్నారు. ఇదే సమయంలో దర్శకుడు అనిల్ రావిపూడితోనూ కొత్త సినిమా ప్రకటించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది. **ప్రశాంత్ నీల్‌తో 'డ్రాగన్'** ప్రస్తుతం ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' చిత్రం రూపొందుతోంది. భారీ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగాయి. ప్రశాంత్ నీల్ తనదైన శైలిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ పూర్తయిన తర్వాత ఈ చిత్రం విడుదలకు సిద్ధం కానుంది. **త్రివిక్రమ్‌తో 'గాడ్ ఆఫ్ వార్'** 'డ్రాగన్' తర్వాత ఎన్టీఆర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ సినిమాకు 'గాడ్ ఆఫ్ వార్' అనే పేరు ప్రచారంలో ఉంది. జూలై నుంచి ఈ ప్రాజెక్టును సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారీ కథా నేపథ్యంతో రూపొందనున్న ఈ చిత్రంపై అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. అయితే సినిమా షూటింగ్ తేదీలు, ఇతర నటీనటుల వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. **అనిల్ రావిపూడితో మరో సినిమా** మరోవైపు ఎన్టీఆర్, అనిల్ రావిపూడి కలయికలో సినిమా ఉంటుందని అధికారికంగా ప్రకటించడం అభిమానులకు మరో కానుకగా మారింది. ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్ రామ్ తన ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే సినీ పరిశ్రమలో ఆసక్తికర చర్చ సాగుతోంది. మాస్, కామెడీ, కుటుంబ వినోద చిత్రాలతో విజయాలు అందుకున్న అనిల్ రావిపూడి.. ఎన్టీఆర్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. **రెండు సినిమాలు ఒకేసారి చేస్తారా?** త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందనున్న భారీ చిత్రానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండటంతో, ఈ మధ్యలో అనిల్ రావిపూడితో ఓ వేగవంతమైన ప్రాజెక్టును పూర్తి చేయాలనే ఆలోచన ఉందని ప్రచారం జరుగుతోంది.

గ్రామీ నామినేషన్లలో 'ధురంధర్'కు నిరాశ!



రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్: ది రివెంజ్ చిత్రానికి 2027 గ్రామీ అవార్డుల్లో నిరాశ ఎదురైంది. ఈ సినిమా నుంచి సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్‌దేవ్ రూపొందించిన పాటలను ఎనిమిది విభాగాల్లో పరిశీలనకు పంపినప్పటికీ, తుది నామినేషన్లలో ఒక్కదానికి కూడా చోటు దక్కలేదు.'ఫిర్ సే', 'జైయే సజనా', 'జాన్ సే గుజర్తే హై', 'కన్హయ్యా', 'ఆరి ఆరి', 'మన్ అట్కేయా' వంటి పాటలు వివిధ విభాగాల్లో పోటీపడ్డాయి. దేశంలో మంచి ఆదరణ పొందిన ఈ పాటలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని చిత్ర బృందం ఆశించినా ఫలితం దక్కలేదు.అయితే, భారతీయ సంగీతానికి గ్రామీ వేదికపై ప్రాతినిధ్యం లభించింది. దేవన్ ఏకాంబరం, సుషా ఆలపించిన తమిళ గీతం 'వరువాయ్' బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్ విభాగంలో నామినేషన్ సాధించింది. గ్రామీ చరిత్రలో ఓ తమిళ పాటకు నామినేషన్ దక్కడం ఇదే తొలిసారి.2027 గ్రామీ నామినేషన్లలో బ్రిటిష్ గాయని రే 11 నామినేషన్లతో ముందుండగా, బియాన్స్ తన కెరీర్‌లో 100 గ్రామీ నామినేషన్లు పొందిన తొలి కళాకారిణిగా చరిత్ర సృష్టించింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613